https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సార్థ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 17 సంచిక : 287 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ శనివారం, ఆగస్టు,15, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-




## ఉత్తరాఖండ్ చమోలీలో ఘోర ప్రమాదం..
# టన్నెల్‌లో ఏడుగురి మృతి

ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో నిర్మాణంలో ఉన్న టన్నెల్‌లో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృతి చెందగా.. 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పిపల్‌కోటిలోని టెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ప్రాజెక్టు వద్ద నిర్మాణంలో ఉన్న టన్నెల్‌లోకి సాయంత్రం 6.30 నుంచి 6.45 గంటల మధ్య భారీగా వరద నీరు ప్రవేశించింది. ఆ సమయంలో సిబ్బంది నిర్మాణ పనులు చేస్తున్నారు.రెస్క్యూ ఆపరేషన్‌లో ఇప్పటివరకు 20 మందిని బయటకు తీసుకొచ్చారు. వారిలో ఏడుగురు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరో 13మంది చికిత్స పొందుతున్నారు. వారిలో ఒకరి పరిస్థితి కొంత విషమంగా ఉండటంతో శ్రీనగర్‌లోని బేస్ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద తీవ్రత నేపథ్యంలో చీణ=ఖీ, భారత సైన్యం, బృందాలను కూడా రంగంలోకి దించారు.

టన్నెల్‌లో ఇంకా ఇద్దరు చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. వారినిసురక్షితంగా బయటకు తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. జిల్లా కలెక్టర్ గౌరవ్ కుమార్, అధికారి అమృత్ లాల్ మీనా సంఘటనా స్థలంలో ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.



టన్నెల్‌లో భారీగా నీరు చేరడంతో రెస్క్యూ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్‌ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టన్నెల్‌లో చిక్కుకున్న ప్రతి ఒక్కరినీ సురక్షితంగా బయటకు తీసుకురావడమే తమ అత్యున్నత ప్రాధాన్యత అని, అన్ని సంబంధిత సంస్థలు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్
# 2.౦ నిర్వహణకు కేబినెట్ నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 14: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మంత్రి మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0 నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఈ సదస్సు నిర్వహించనుంది.
ఈ సదస్సు నిర్వహణకు ప్రత్యేక కమిటీలను కేబినెట్ ఏర్పాటు చేయనుంది. గత ఏడాది కంటే ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈసారి 'ఇన్వెస్ట్ తెలంగాణ'థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించనుంది. ఫ్యూచర్ సిటీ ప్లాన్‌ను ప్రజలకు వివరించనుంది. తెలంగాణలో డిఫెన్స్, ఏరో స్పేస్, ఫార్మాతో పాటు వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా సదస్సు నిర్వహించనుంది. వివిధ రంగాల్లో తెలంగాణ స్టార్టప్, పరిశ్రమలు సాధించిన విజయాలు.. వివిధ రంగాల కొత్త ఆవిష్కరణల ప్రదర్శన ఏర్పాటు చేయాలని మంత్రులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.



# దాడి తర్వాత అకాలీదళ్ చీఫ్ సుఖ్‌బీర్ సింగ్ రియాక్షన్

నాందేడ్: తానుభయపడే ప్రసక్తే లేదని అకాలీదళ్ చీఫ్, ?మాజీ డిప్యూటీ సీఎం సుఖ్‌బీర్ సింగ్ బాదల్ స్పష్టం చేశారు. తనపై జరిగిన దాడిని ఆయన కుట్రగా అభివర్ణించారు. పంజాబ్ శాంతిభద్రతలను అస్థిరపరిచే కుట్ర జరుగుతుందని ఆయన మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు అకాలీదళ్ కట్టుబడి ఉందన్నారు.

మహారాష్ట్రలోని నాందేడ్‌లో తనపై జరిగిన దాడి ఘటనపై ఆయన (శుక్రవారం) మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రం కోసం తమ పార్టీ ఎలాంటి బలి దానానికైనా సిద్ధంగా ఉందని.. అయితే పంజాబ్ శాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమంటూ తేల్చి చెప్పారు. పంజాబ్ ప్రగతి, మతసామరస్యం, ఐక్యత తమ మొదటి ప్రాధాన్యతగా ఆయన పేర్కొన్నారు.

నాందేడ్‌లోని ఓ గురుద్వారాను తన కుటుంబంతో కలిసి దర్శించుకునేందుకు వెళ్లిన సమయంలో జస్పాల్ సింగ్ అనే వ్యక్తి చిన్నకత్తితో సుఖ్‌బీర్ సింగ్ బాదల్ దాడికి యత్నించాడు. అయితే ఆయనతో పాటు ఉన్న




సెక్యూరిటీ సిబ్బంది అలర్ట్ కావడంతో బాదల్ కుడి చేతికి గాయమైంది. దాడి చేసిన నిందితుడిని పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకోగా.. అతడు పుణేకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. గత రెండేళ్లుగా ఆ గురుద్వారాలో సేవకుడిగా పనిచేస్తున్నట్లు సమాచారం.

## అసైన్డ్ భూముల కేసు..
# చంద్రబాబుకు సుప్రీంలో బిగ్ రిలీఫ్

ఢిల్లీ, ఆగస్టు 14: అసైన్డ్ భూముల కేసులో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి నారాయణలకు సుప్రీంకోర్టులో బిగ్‌రిలీఫ్ దక్కింది.వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన ఎస్ఎల్పీని సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసునుపూర్తిగా కొట్టివేస్తూ ఏపీ హైకోర్టు ఇచ్చిన తీర్పును అత్యున్నతన్యాయస్థానం సమర్థించింది. ఏపీ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి తగిన కారణాలు లేవని ధర్మాసనంస్పష్టం చేసింది.

రాజకీయ కక్షసాధింపుతోనే ఈ కేసు నమోదు చేశారనే ఏపీ హైకోర్టు వ్యాఖ్యలను సుప్రీం ధర్మాసనం పునరు ద్ఘాటించింది. రాజధాని ల్యాండ్ పూలింగ్, జీఓల జారీ పరిపాలనాపరమైన విధాన నిర్ణయాలని.. ఏఒక్క బాధితుడూ కోర్టుకు రానప్పుడు రాజకీయ ప్రత్యర్థులు వేసిన పిటిషన్లకు చట్టబద్ధత ఉండదనే హైకోర్టు అభిప్రాయం తో సుప్రీంకోర్టు ఏకీభవించింది. న్యాయస్థానాలను రాజకీయ కక్షసాధిం పులకువేదికగా మార్చవద్దని



హితవు పలికింది.వైసీపీ హయాంలో సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల విచారణను సుప్రీంకోర్టు ముగించింది.

## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్, హైకోర్ట్, ఎర్రకోట సహా
## కీలక ప్రదేశాలకు బాంబు బెదిరింపు.. హై అలర్ట్



**న్యూఢిల్లీ,ఆగస్టు 14:**దేశం ఒకపక్క స్వాతంత్ర్య దిన వేడుకలకు సిద్ధమవుతుంటే.. మరోపక్క దేశ రాజధానికి మాత్రం బాంబు బెదిరింపులు వచ్చాయి. ఢిల్లీలోని ఎయిర్‌పోర్టు, ఎర్రకోట,హైకోర్ట్ సహా కీలక ప్రదేశాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఇందుకు సంబంధించి శుక్రవారం అధికారులకు ఒక ఈమెయిల్ వచ్చింది. దీనిలో ఢిల్లీలోని కోర్టులు, రైళ్లలో పేలుళ్లకు పాల్పడతామని హెచ్చరించారు. ఆగస్టు 15న ఈ పేలుళ్లు జరుపుతామని మెయిల్‌లో ఉంది. అందులోనూ ఢిల్లీ హైకోర్టును ఆగస్టు 15న మధ్యాహ్నం 2.11 గంటలకు పేల్చేస్తామని కూడా పేర్కొన్నారు. ఢిల్లీని ఖలిస్తాన్‌లో భాగంగా చేయాలనే లక్ష్యంతో ఈ పేలుళ్లు జరుపుతామని మెయిల్‌లో పేర్కొన్నారు.

సిక్కులకు న్యాయం చేయడంలో ఢిల్లీ హైకోర్టు విఫలమైనట్లు, అందులోనూ 1984లో జరిగిన సిక్కు అల్లర్ల కేసులో బాధిత సిక్కులకు కోర్టు న్యాయం చేయలేకపోయిందని, అందుకే ఢిల్లీ హైకోర్టును టార్గెట్ చేశామని మెయిల్‌లో వివరించారు. ఢిల్లీలో ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ 3ని పేల్చేస్తామన్నారు.

జామ్‌నగర్ హౌజ్, ఝండేవాలన్ బిల్డింగ్ వంటివాటికి కూడా బాంబు ముప్పు ఉంది. ఈ బాంబు హెచ్చరికల నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, భద్రతా బలగాలు హై అలర్ట్ ప్రకటించారు. బాంబు బెదిరింపులు ఉన్న ప్రదేశాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. గట్టి నిఘా, బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంట్రీ, ఎగ్జిట్ రూట్లలో తనిఖీలు చేపడుతున్నారు. ఇతర పబ్లిక్ ప్లేసులలో కూడా తనిఖీలు చేపట్టారు.

ఢిల్లీ హైకోర్టు, ఎయిర్‌పోర్టులలో భద్రతను మరింతకట్టుదిట్టం చేశారు. శనివారం, ఆగస్టు 15న ఢిల్లీలో స్వాతంత్ర్య దిన వేడుకలు జరగనున్న సంగతి తెలిసిందే. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ వేడుకల కోసంఢిల్లీ నగరంలోని ఎర్రకోట ముస్తాబవుతోంది. ఈ నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. వేడుకల కోసం మండి హౌజ్ మెట్రో స్టేషన్, ఐటీవో బిల్డింగులను అందంగా అలంకరించారు.

# పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట..

### - సావర్కర్‌పై వ్యాఖ్యల కేసు కొట్టివేత

**న్యూఢిల్లీ,ఆగస్టు 14:**పరువునష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వినాయక్ దామోదర్ సావర్కర్‌పై గతంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి దాఖలైన క్రిమినల్ పరువునష్టం కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో అంతకుముందు లక్నో కోర్టుజారీ చేసిన సమన్లనుకూడా కోర్టు రద్దు చేసింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షిల్ నాగుతో కూడిన ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసు విచారణకు అవసరమైన అనుమతిని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం నుంచి పొందలేదని, అందువల్ల ఇది విచారణార్హం కాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దీంతో రాహుల్‌పై నమోదైన క్రిమినల్ పరువునష్టం కేసును కొట్టివేసింది. ఈ పిటిషన్‌పై తమ అనుమతి తీసుకున్నట్లు ఎలాంటి ఆధారాలు తమ వద్ద లేదని చెబుతూ ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఇచ్చిన వివరణను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలివి.

భారత్ జోడో యాత్ర సందర్భంగా 2022, నవంబర్ 17నమహారాష్ట్రలోని అకోలాలోపర్యటిస్తుండగా రాహుల్ గాంధీ.. సావర్కర్‌పై కొన్ని వ్యాఖ్యలు చేశారు. అయితే,రాహుల్ ఉద్దేశపూర్వకంగా సావర్కర్ గౌరవాన్ని తగ్గించే లక్ష్యంతో నే ఈ వ్యాఖ్యలు చేశారని, ఆయన పరువుకు భంగం కలిగించా



రని ఆరోపిస్తూ నృపేంద్రపాండే అనే లాయర్.. రాహుల్‌పై ఫిర్యాదు చేశాడు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లక్నో కోర్టు దీనిపై విచారణ జరిపి, రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసింది. ఈనోటీ సులను సవాల్ చేస్తూ రాహుల్ గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో తనపై నమోదైన కేసును కొట్టేయాలని కోరారు. స్పందించిన సుప్రీంకోర్టు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. దీనికి యూపీ ప్రభుత్వం బదులి స్తూ ఒక అఫిడవిట్ సమర్పించింది..

# నేను కాంగ్రెస్ నాయకులను విమర్శించలేదు: కోమటిరెడ్డి

**హైదరాబాద్,ఆగస్టు 14:**రాజకీయ చర్చ నడుస్తున్న వేళ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. యాదాద్రి భువనగిరి జిల్లాచౌటుప్పల్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఎక్కడా కాంగ్రెస్ పార్టీ నాయకులను కానీ, పార్టీని కానీ విమర్శించలేదని... విమర్శించబోనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్ పార్టీనే అని... భవిష్యత్తులో రాష్ట్ర అభివృద్ధి కూడా ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని అన్నారు.

రాహుల్ గాంధీ నాయకత్వంలోనే తాను కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతానని స్పష్టం చేశారు. పార్టీని నమ్ముకుని దశాబ్దాలుగా జెండా మోసిన అసలైన కాంగ్రెస్ నాయకులకు, తెలంగాణ ఉద్యమకారులకు ప్రజాపాలనలో తగిన గుర్తింపు లభించాలనే ఉద్దేశంతోనే తాను మాట్లాడానని ఆయన చెప్పారు. సీమాంధ్ర పాలకులు, కాంట్రాక్టర్ల చెప్పుచేతల్లో తెలంగాణ ప్రభుత్వం లేదా పార్టీ నడవకూడదని సూచించారు. ప్రజాపాలన అంటే కేవలం పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల కోసం కాదని... పేద ప్రజల సంక్షేమం కోసమే పనిచేయాలని స్పష్టం చేశారు.



# పార్టీ గీత దాటితే చర్యలు తప్పవు..
## రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ గరం

**హైదరాబాద్,ఆగస్టు 14:**

కాంగ్రెస్ పార్టీతో ఏమాత్రం సంబంధం లేని వారు, ఆంధ్ర నాయకుల మోచేతి నీళ్లు తాగే వారు ప్రభుత్వంలో కీలక పదవులు అనుభవిస్తుండటం సహించరాని విషయం అంటూ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అధికారపార్టీలో నిప్పు రాజేశాయి. ఈ నేపథ్యంలోనే రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై తాజాగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వం, పార్టీ అధిష్టానంపై ఆయన పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు తన దృష్టికి వచ్చాయని తెలిపారు. విషయాన్ని ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ దృష్టి తీసుకెళ్తామని అన్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే ఎంతటి నేతనైనా సహించేది లేదని వార్నింగ్ ఇచ్చారు. పార్టీగీత దాటితే ముఖ్యమంత్రితో సహా ఎవరైనా సరే అందరూ ఒకటేనని అన్నారు. క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడితే ఖచ్చితంగా చర్యలుంటాయని పేర్కొన్నారు. రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, తీసుకోవాల్సిన చర్యలపై కాంగ్రెస్ హైకమాండ్‌తో చర్చిస్తాని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో మునుగోడులో ప్రచారం సందర్భంగా రాజగోపాల్ రెడ్డికి పార్టీ అధిష్టానం కొన్ని హామీలు ఇచ్చి ఉండవచ్చని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



అన్నారు. అయిన ప్పటికీ, పార్టీకి వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడటానికి ఎవరికీ హక్కు లేదని అన్నారు.పదవులు, మంత్రివర్గ విస్తరణపై పార్టీ హైకమాండ్‌దే తుది నిర్ణయమని.. ఒకేరోజు అందరి కోరికలు తీర్చడంఎంతటి వారికైనా సాధ్యం కాదిని కుండబద్దలు కొట్టారు. అయితే, మంత్రివర్గంలో స్థానం లభించలేదన్న అసంతృప్తితో పాటు నియోజకవర్గానికి నిధుల కేటాయింపుపై రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకత్వం తీవ్రంగా పరిగణి స్తున్నట్లు తెలుస్తోంది.

# పంద్రాగస్టు వచ్చిందంటే అందరికంట కన్నీరే..!

## – ఆ..'ఘోర కేళి'కి 21ఏళ్లు..!!

**- నారాయణపేటలో నెత్తురు చిమ్మిన 2005,పంద్రాగస్టు వేడుకలు... - మావోయిస్టుల తూటాలకు అప్పటి ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి,వారి తనయుడు చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డితో పాటు మరో 9 మంది మృతి... -ఎమ్మెల్యే కొబ్బరికాయ కొడుతున్న సమయంలోనే పేలిన మావోయిస్టుల తూటాలు,నేలకొరిగిన నేతలు... -నారాయణపేట పిఎస్ పరిధిలో క్రైమ్ నెంబర్ 81/2005 కేసు నమోదు... -ఆ ఘాతుకం యాదికొస్తది..!!**











**నారాయణపేట,(డీకే చాటింపు):** నారాయణపేటలో పంద్రాగస్టు వచ్చిందంటే చాలు 2005,ఆగస్టు15న జరిగిన మావోయిస్టుల ఘాతుకం ప్రతి ఒక్కరి మనసు కలచివేస్తోంది.ఈ ఘటనలో మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి, తనయుడు చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డితో పాటు మరో 9 మంది మావోస్టుల తూటాలకు బలయ్యారు.. ఈ..'ఘోర కేళి'కి శనివారంతో 21ఏళ్లు..!!పంద్రాగస్టు వచ్చిందంటే అందరికంట కన్నీరే..!!నాటి దృశ్యాలు నేటికీ అందరి కంటతడి పెట్టిస్తున్నాయి.!!

**మధ్యాహ్నం1.25 గంటల సమయంలో...**

అప్పటి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి మధ్యాహ్నం 1.25 గంటల సమయంలో నారాయణపేట పట్టణంలోని పళ్ళ హరిజనవాడలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన తర్వాత ఎంబీ హై స్కూల్ ముందున్న ఆంజనేయస్వామి ఆలయ ప్రాంతంలో సీసీ రోడ్డు పనులకు శిలాఫలకం దగ్గర కొబ్బరికాయ కొడుతున్న సమయంలోనే ఆ ప్రాంతంలో అప్పటికే ఆ ప్రాంతంలో మాటువేసిన మావోయిస్టులు ఏకే 47తో విచక్షణ రహితంగా జరిపిన కాల్పుల్లో సంఘటన స్థలంలోనే 8 మంది మృతి చెందారు. ఆస్పత్రిలో చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందారు.ఈ కాల్పుల్లో ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి(77) తో పాటు వారి తనయుడు చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి(38), స్థానిక మున్సిపల్ కమిషనర్ డి.వి రామ్మోహన్(45), ఎమ్మెల్యే గన్ మ్యాన్ రాజారెడ్డి(42), ఎమ్మెల్యే డ్రైవర్ శ్రీనివాసులు(35),ఆర్డిఓ కార్యాలయ అటెండర్ సాయిబన్న(48),మాగనూరు మండల యూత్ కాంగ్రెస్ నేత లోకేశ్వర్ రెడ్డి(26), ఊట్కూరు మండలం తిప్రాస్ పల్లి కాంగ్రెస్ నేత మోనప్ప(31), రవీందర్ గౌడ్(38)మృతి చెందారు.ఆ తర్వాత నారాయణపేట నివాసి దూడం విజయ్ కుమార్, చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి డ్రైవర్ అరీఫ్ మృతి చెందారు. ఆర్డిఓ శివారెడ్డి,డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సుదర్శన్ రెడ్డి, దివంగత ఘన్‌శ్యామ్ దాస్ ధరక్ తదితరులు తీవ్రంగా గాయపడి ఆ తర్వాత కోలుకున్నారు.ఎమ్మెల్యే పిఏ భాస్కర్,నారాయణపేటకు చెందిన నాగేందర్,అవుటి రాజశేఖర్ లోట్టి శ్రీనివాస్ (ఎల్.ఎస్),సూర్యకాంత్ తదితరులు గాయపడ్డారు.ఈ సంఘటనపై నారాయణపేట పిఎస్ పరిధిలో క్రైమ్ నెంబర్ 81/2005 కేసు నమోదయింది.

**గుర్మిట్కల్ లో మావోయిస్టుల షెల్టర్...**

నారాయణపేట సరిహద్దులోని కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ లో ఓ అద్దె ఇంట్లో మావోయిస్టులు షెల్టర్ తీసుకొని రోజు నారాయణపేటకు వచ్చి రెక్కీ నిర్వహించి ఈ ఘాతకానికిపాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.

**నారాయణపేటకు వైయస్ రాక...**

ఈ సంఘటనతో దివంగత సీఎం వైయస్ రాజశేఖర్ రెడ్డి,పిసిసి అధ్యక్షులు కే. కేశవరావు,దివంగత ఎంపీ జైపాల్ రెడ్డి ప్రత్యేక హెలికాప్టర్ లో నారాయణపేటకు చేరుకొని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే,ఇతరుల మృత దేహాలకు శ్రద్ధాంజలి ఘటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు.ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం మావోయిస్టులపై నిషేధాన్ని విధించింది.అప్పటి హైదరాబాదు రీజియన్ ఐజి ఆర్‌పి మీనా స్థానిక పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసి డీకే అరుణకు సారీ చెప్పారు.బాధిత కుటుంబ సభ్యుల విద్యార్హతలను బట్టి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలను కల్పించింది. చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి సతీమణి చిట్టెం లక్ష్మీ ఐఏఎస్ గా ఎంపికయ్యారు(అంతకు ముందే చిట్టెం లక్ష్మి గ్రూప్ వన్ మెయిన్స్ రాసి ఇంటర్వ్యూ కు వెళ్లే సమయంలోనే ఈ సంఘటన జరిగింది).

**మొదటగా ఉమ్మడి నల్గొండ జిల్లా భువనగిరి ఆర్డీవోగా**

ప్రస్తుతంఐ.ఏ.ఎస్ క్యాడర్లో జనరల్ అడ్మినిస్ట్రేషన్ (జిఏడి)విధులు నిర్వహిస్తున్నారు.దివంగత చిట్టెం నర్సిరెడ్డి కూతురు, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ,కొడుకు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి.అలాగే దివంగత చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి కూతురు డాక్టర్ చిట్టెం పర్నిక రెడ్డి



తాజాగా నారాయణపేట ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

## డీ ఈ ఓ కార్యాలయంలో సీ సీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 14 (డీ కే చాటింపు):నిజామాబాద్ జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయంలో సీ సీ కెమెరాలు వెంటనే ఏర్పాటు చేయాలని పిఆర్టీయు తెలంగాణ గౌరవ అధ్యక్షుడు కృపాల్ సింగ్ సోడి డిమాండ్ చేశారు.పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఆదేశాలు స్పష్టంగా ఉన్నా , డీ ఈ ఓ మౌనంగా ఉండడం ఏంటని అన్నారు.కార్యాలయ ఆవరణ అంతటా సీ సీ కెమెరాలు ఏర్పాటు చేయకుండా కేవలం ఛాంబర్ లో మాత్రమే సీ సీ కెమెరా ఏర్పాటు చేయుటలో సిబ్బంది ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తుందని అన్నారు. సీ సీ కెమెరా లు ఉంటే ఎక్కడ తమ లావాదేవీలు,సమయ పాలన బయట పడుతుందేమో అని కెమెరాలు ఏర్పాటులో జాప్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. విద్యా శాఖ పారదర్శకతకు మారు పేరుగా ఉండాలని తెలిపారు.

## ఉద్యమకారుల సేవలకు ఘన సత్కారం

హైదరాబాద్, ఆగస్టు14 (డీకే చాటింపు) : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారుల సేవలను గుర్తిస్తూ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. శుక్రవారం తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ కాచం సత్యనారాయణ, ఎల్బీనగర్ ఇన్‌చార్జి బీరెల్లి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కంఠం సైదులుకు ప్రశంస పత్రాన్ని అందజేశారు. తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులు చేసిన పోరాటాలు, త్యాగాలు, ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో వారి పాత్రను ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ కొనియాడారు. ఉద్యమం కోసం అహర్నిశలు శ్రమించిన వారిని గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యత అని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మరి కొంతమంది ఉద్యమకారులు ఎల్బీనగర్, మహేశ్వరం నియోజకవర్గాలకు చెందిన ఉద్యమకారులకు ప్రశంస పత్రాలను అందజేశారు ప్రశంసా పత్రాలను అందుకున్న వారు నర చంద్రశేఖర్ రెడ్డి, ఈ. అశోక్ కుమార్, కడిమల గోపాల్, బొమ్మకంటి శ్రీనివాస్, మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన చింతపట్ల రవీందర్, అనంత కుమార్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ కోసం సాగిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందని, ఉద్యమకారుల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కాచం సత్యనారాయణ బీరెల్లి వెంకట్ రెడ్డి నాయకులు అన్నారు.



## మండల స్థాయి ప్రజావాణి సమర్థవంతంగా నిర్వహించాలి

### జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్

మంచిర్యాల్ (డీకే చాటింపు),ఆగస్టు 14,: ఈనెల 17వ తేదీకు ప్రారంభం కానున్న మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భావన సమావేశ మందిరంలో ప్రజావాణి పర్యవేక్షకులు శ్రావణ్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, హెచ్ హెచ్ ఆర్ పి సుమన్ లతో కలిసి జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ... మండల స్థాయిలో ప్రజల సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, సంబంధిత శాఖలకు పంపించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. డేటా ఎంట్రీ, ఫిర్యాదుల నమోదు, రసీదు జారీ, వివరాల నమోదు తదితర సాంకేతిక అంశాలపై సాంకేతిక శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య





మంచిర్యాల్(డీకే చాటింపు),ఆగస్టు 14,: ప్రభుత్వ విద్యా సంస్థలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ మండలం సోమనపల్లిలో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను డి.ఈ.ఈ., ఈ డబ్ల్యు ఐ డి సి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, ఈ క్రమంలో నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. అభివృద్ధి పనులలో ఏమైనా ఇబ్బందులు తలెత్తినట్లయితే వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో పంట కుంట మార్కింగ్ పనులను పరిశీలించి నిబంధనల ప్రకారం లక్ష్యాలను సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. భీమారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, వంటశాల, పారిశుధ్యం, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించి అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులు, గుత్తేదారును ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, విద్యా బోధన, వసతి, భోజనం నాణ్యత అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బేస్ లైన్ టెస్ట్ ఫలితాల ఆధారంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించాలని, పరిశుభ్రత ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, హాజరు పట్టికలు, నిర్వహణ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందూరులో మారుమోగిన త్రివర్ణ పతాకం ర్యాలీ




నిజామాబాదు ఆగస్టు14 (డికే చాటింపు): ఇందూరు లోహర్ గర్ తిరంగ జండా బీజేపీ ఆధ్వర్యం లో శుక్రవారం రాజా రాజేంద్ర చౌరస్తా నుండి భారీ ర్యాలీ ను ప్రారంభించారు. ప్రతి భారతీయుని ఇంటి పైన త్రివర్ణ పతాకం ఎగరాలని , యువత కు జాతీయ భావం , దేశ భక్తి పెంపొందించాల్సిన అవశ్యకత ఉందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్య నారాయణ,ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి లు పిలుపునిచ్చారు. కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ ఐక్యమైత్యంగా ఒక్కటి చేసేది జండా పండగ అని అన్నారు. స్వతంత్ర సమర యోధుల చరిత్ర చాటి చెప్పాల్సిన అవసరం ఉంది.దేశ సమగ్రతకు భంగం కలిగించిన మతాల మధ్య చిచ్చు పెట్టాలని చూసే దేశద్రోహులను ఏరి పడేయాలని ఎమ్మెల్యే లు అన్నారు. ఈ భారీ ర్యాలీ లో జిల్లా బీజేపీ అధ్యక్షుడు దినేష్ కులాచారి , రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు ,స్వచంద సంస్థల ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు.

## ఎండిపోతున్న పంటలు... ఎల్ నినో ప్రభావం..

**ఒంగోలు,** : మార్కాపురం జిల్లా కనిగిరి నియోజకవర్గంలో నిమ్మసాగు ఎక్కువగా ఉంది. మార్కాపురం, కనిగిరి, వైపాలెం, గిద్దలూరు, దర్శి, కొండేపి, కందుకూరు నియోజకవర్గాల్లో 4 వేల హెక్టార్లలో సాగుచేస్తుండగా.. కేవలం కనిగిరి ప్రాంతంలోనే 2 వేల హెక్టార్లు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం నిమ్మసాగుపై చూయించింది. ఆగస్టు రెండో వారం వస్తున్నా ఇప్పటి వరకు చినుకు జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడకపోతే నిమ్మ చెట్లు ఎండిపోయే ప్రమాదం ఉంది.రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతం ఏదైనా ఉందంటే అది పశ్చిమ ప్రకాశమే.. ప్రస్తుత మార్కాపురం జిల్లా. వ్యవసాయం మినహా మరేయితర పరిశ్రమలు లేని ఏకైక జిల్లా మార్కాపురం. వ్యవసాయం కూడా కేవలం వర్షాల మీద మాత్రమే ఆధారపడాలి. వర్షాలు పడితేనే ఇక్కడ ప్రజలకు పంటలైనా, నీళ్లైనా.. ఏదైనా వర్షమే ఆధారం. ఎలాంటి పంట కాల్వలు లేని జిల్లా కూడా మార్కాపురమే! గతేడాది మొంథా తుఫాను పుణ్యమా అంట వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు నిండి నీటికి ఇబ్బంది లేకుండా ఉంది. కానీ, ఈ ఏడాది ఆగస్టు మొదటి వారం గడుస్తున్నా కనీసం చినుకు కూడా లేదు. ఈ ఎల్‌నినో ప్రభావం రైతులపై ఎక్కువగా పడింది.మార్కాపురం జిల్లాలో బోరు కింద పండించే పంటలు కంటే వర్షాల మీద ఆధారపడి పండేంచేవే ఎక్కువ. హార్టికల్చర్ కింద మాత్రం కనిగిరి, మార్కాపురం నియోజకవర్గాల్లో నిమ్మ సాగు మాత్రం కొన్ని ప్రాంతాల్లో ఉంది. ఇప్పుడు ఆ నిమ్మ సాగు కూడా ప్రమాదంలో పడింది. ఈ ప్రాంతం నుంచి బెంగళూరు, హైదరాబాద్‌కు నిమ్మకాయలు ఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. రోజుకు కొన్ని వందల బస్తాలను రైతులు ఎగుమతి చేస్తుంటారు.గతేడాది మొంథా తుఫాను తర్వాత చెప్పుకోదగ్గ వర్షాలు ఇప్పటి వరకు నమోదుకాలేదు. ఎండలు ఎక్కువగా నమోదు కావడం, వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటాయి.

డీకే సారథ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక
శనివారం, ఆగస్టు,15, 2026

# ముంచుకొస్తోంది డిజిటల్ డ్రగ్!

టెక్నాలజీ మనిషి జీవితాన్ని సులభతరం చేయాలి. కానీ అదే టెక్నాలజీ మనిషి మెదడును తన గుప్పిట్లోకి తీసుకుని బానిసను చేస్తే?సరిగ్గా ఇదే అంశంపై కాలిఫోర్నియా జ్యూరీ ఇచ్చిన తీర్పు ఇఓప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సోషల్ మీడియా వ్యసనానికి మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్), యూట్యూబ్ వంటి సంస్థలే బాధ్యత వహించాలని కోర్టు స్పష్టం చేస్తూ, 6 మిలియన్ డాలర్ల జరిమానా విధించడం ఒక చారిత్రాత్మక పరిణామం. సోషల్ మీడియా అనేది కేవలం సమాచార మార్పిడి వేదిక మాత్రమే కాదు, అదొక పకడ్బందీగా రూపొందించబడిన 'డిజిటల్ సైకాలజీ'. వినియోగదారుడు యాప్‌ను క్లోజ్ చేయకుండా నిరంతరం స్క్రోల్ చేస్తూనే ఉండేలా చేసే 'ఇన్‌ఫైనైట్ స్క్రోలింగ్', ఆటో-ప్లే ఫీచర్లు యాదృచ్ఛికంగా వచ్చినవి కావు. అవి యూజర్ల మెదడులో డోపమైన్ విడుదలను ప్రేరేపించి, వారిని ఒక రకమైన మత్తులోకి నెట్టేలా డిజైన్ చేయబడ్డాయి. ఈ ఉచ్చులో పడి పసిపిల్లలు తమ సహజత్వాన్ని కోల్పోతున్నారు. ఇప్పటివరకు సోషల్ మీడియా వినియోగాన్ని వ్యక్తిగత అలవాటుగా మాత్రమే చూశాం. ఫోన్ ఎక్కువగా చూస్తున్నారు అంటే వారి తప్పే అని భావించాం. కానీ ఈ తీర్పు ఆ ఆలోచనను పూర్తిగా మార్చేసింది. వినియోగదారుల బలహీనతలను గుర్తించి, వారిని ఎక్కువసేపు యాప్‌లలోనే ఉంచేలా రూపొందించిన ఆల్గారిథమ్స్ కూడా ఒక కారణమని కోర్టు స్పష్టం చేసింది. అంటే ఇది కేవలం వినియోగదారుడి తప్పు మాత్రమే కాదు.. ఇది వ్యవస్థపరమైన సమస్య. సోషల్ మీడియా కంపెనీలు రూపొందించిన ఆటోప్లే, ఇన్‌ఫినిట్ స్క్రోలింగ్, నిరంతర నోటిఫికేషన్లు వంటి ఫీచర్లు సాధారణ సాంకేతిక సౌకర్యాలు కావు. అవి మన దృష్టిని బంధించే పద్ధతులు. మన మెదడు డోపమైన్‌పై ఆధారపడేలా చేసే ఒక మానసిక వ్యూహం. ఇది వినోదం పేరుతో వ్యసనాన్ని పెంచే డిజైన్. అందుకే నిపుణులు దీన్ని డిజిటల్ సైకాలజీగా పేర్కొంటున్నారు. ఇక్కడ ముఖ్యంగా ఆందోళన కలిగించే విషయం పిల్లలపై పడుతున్న ప్రభావం. చిన్న వయసుల్లోనే సోషల్ మీడియా వినియోగం ప్రారంభమవుతోంది. వాస్తవ ప్రపంచంతో పోల్చితే వర్చువల్ ప్రపంచమే వారికి నిజమైన జీవితం అనిపించే స్థితి వస్తోంది. అందం అంటే ఏమిటి? విజయం అంటే ఏమిటి? సంబంధాలు అంటే ఏమిటి? అన్న భావనలు కూడా సోషల్ మీడియా ప్రభావంతో మారిపోతున్నాయి. దీని ఫలితంగా ఆందోళన, ఒంటరితనం, డిప్రెషన్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. కాలిఫోర్నియా కోర్టు తీర్పు ఈ సమస్యను వ్యక్తిగత స్థాయి నుంచి సామాజిక స్థాయికి తీసుకువచ్చింది. ఇది ఇక ఒక కుటుంబ సమస్య కాదు. ఇది ఒక ప్రజారోగ్య సమస్య. పొగాకు కంపెనీలపై గతంలో వచ్చిన తీర్పుల మాదిరిగా, ఇప్పుడు సోషల్ మీడియా కంపెనీల బాధ్యతపై కూడా ప్రపంచవ్యాప్తంగా చర్చ ప్రారంభమైంది. ఇది ఒక కొత్త దిశలో ప్రారంభమైన మార్పు.

అయితే ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. మొత్తం బాధ్యత కంపెనీలదేనా? వినియోగదారుల బాధ్యత ఏమిటి? తల్లిదండ్రుల పాత్ర ఏమిటి? సమాధానం సులభం కాదు. కానీ స్పష్టమైన విషయం ఏమిటంటే.. ఇది ఒక సంయుక్త బాధ్యత. కంపెనీలు తమ ప్లాట్‌ఫారమ్‌లను బాధ్యతాయుతంగా రూపొందించాలి. ప్రభుత్వాలు నియంత్రణ చట్టాలు తీసుకురావాలి. తల్లిదండ్రులు పిల్లల డిజిటల్ అలవాట్లపై పర్యవేక్షణ చేయాలి. ముఖ్యంగా వినియోగదారులు తమ సమయాన్ని నియంత్రించుకోవడం నేర్చుకోవాలి. ఈ తీర్పు మరో ముఖ్యమైన సందేశాన్ని కూడా ఇస్తోంది. సాంకేతికత మన కోసం ఉండాలి.. మనపై ఆధిపత్యం కోసం కాదు. మన జీవితం సులభతరం చేయడానికి వచ్చిన సాధనాలు మన జీవితాన్ని నియంత్రించే స్థాయికి చేరుకుంటే, అది అభివృద్ధి కాదు. అది ప్రమాద సంకేతం. ఇప్పుడు ప్రపంచం ఒక కీలక మలుపు వద్ద నిలిచింది. సోషల్ మీడియా భవిష్యత్తు ఎలా ఉండాలి? అది లాభాల కోసం పనిచేసే యంత్రంగానే కొనసాగాలా? లేక సమాజానికి మేలు చేసే బాధ్యతాయుత వేదికగా మారాలా? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైనది. ఈ నేపథ్యంలో భారతదేశం వంటి యువ జనాభా అధికంగా ఉన్న దేశాలకు ఈ తీర్పు ఒక ముఖ్యమైన హెచ్చరికగా పరిగణించాలి. ఇప్పటికే మన దేశంలో చిన్న వయస్సు పిల్లల నుంచి కాలేజీ యువత వరకు సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగింది. రోజుకు గంటల కొద్దీ ఫోన్‌లకు పరిమితమవుతున్న జీవితం వారి చదువు, వ్యక్తిత్వ వికాసం, మానసిక ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపుతున్నది.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే సారథ్యంలో చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారథ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి:
సెల్ : 9603754136 - 7386287837

## గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ

# బిల్లుకి బిఆర్ఎస్ మద్దతు

### పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర




డీకే చాటింపు ; హనుమకొండ ప్రతినిధి ; 14 ఆగస్టు 2026 ; పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాల నిర్మాణం,తయారీ రంగం, స్వచ్ఛ ఇంధన సాంకేతికతలు దేశ భద్రతకు ఖనిజ సంపద వెన్నెముక వంటిదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర చెప్పారు. అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణ లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఈ సమయంలో, కీలక ఖనిజాలు, అరుదైన భూలోహాలు, వ్యూహాత్మక ఖనిజాల అవసరం మరింత పెరగనుందన్నారు.గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ -2026 బిల్లుపై రాజ్యసభలో గురువారం జరిగిన చర్చ సందర్భంగా ఎంపీ రవిచంద్ర మాట్లాడారు. పారదర్శకమైన, స్థిరమైన, పెట్టుబడి దారులకు విశ్వాసాన్ని కలిగించే గనుల విధానం దేశ ఆర్థికాభివృద్ధికి అత్యంత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సవరణ బిల్లు ప్రధాన ఉద్దేశ్యం గనుల రంగంలో పన్నులు, సెస్‌లు, ఇతర రుసుముల విధానంలో స్పష్టత, ఏకరూపత తీసుకురావడం అన్నారు. ఖనిజ హక్కులు, గనుల భూములపై రాష్ట్రాలు విధించే పన్నులు, రుసుంల విషయం లో కేంద్ర ప్రభుత్వం అవసరమైన నిబంధనలు, పరిమితులు నిర్దేశించే అధికారం పొందుతుందని ఎంపీ రవిచంద్ర చెప్పారు. దీనివల్ల బహుళ పన్నుల భారం తగ్గి, పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడుతుం దన్నారు. ఇప్పటికే రాష్ట్రాలు వసూలు చేసిన మొత్తాలకు చట్టబద్ధత కల్పిస్తూ, వాటిని తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని కూడా ఈ బిల్లు స్పష్టం చేస్తున్నదని ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు. స్వతంత్ర శాసన,విధాన విశ్లేషణలు ఈ బిల్లు గనుల రంగంలో పెట్టుబడిదారులకు విధానపరమైన స్థిరత్వం, నియంత్రణలో స్పష్టత, వ్యాపార సౌలభ్యాన్ని పెంపొందిస్తుందని ఆయన వివరించారు. అదే సమయంలో, ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల ఆర్థిక హక్కులు, సమాఖ్య స్ఫూర్తి,జాతీయ ప్రయోజనాల మధ్య సమతుల్యతను కాపాడాల్సిన అవసరాన్ని కూడా అవి గుర్తించాయన్నారు. పెట్టుబడులను ప్రోత్సహించే సంస్కరణలకు మద్దతు నిస్తున్నామని అయితే, సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తి దెబ్బతినకుండా రాష్ట్రాల ప్రయోజనాలు కూడా సమానంగా రక్షించబడాలని ఎంపీ రవిచంద్ర చెప్పారు.గనుల తవ్వకాల వల్ల పర్యావరణ పరిరక్షణ, పునరావాసం, సామాజిక బాధ్యత వంటి భారాన్ని రాష్ట్రాలే భరిస్తున్నాయని, అందువల్ల వారి ఆదాయ హక్కులు, అభివృద్ధి అవసరాలు సముచితంగా పరిరక్షించబడాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఖనిజ వనరుల నిర్వహణలో పారదర్శక విధానాన్ని అనుసరించిందని, తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, అప్పుడు పరిశ్రమల మంత్రిగా ఉన్న కే.టి. రామారావుల కృషితో గనుల అనుమతుల ప్రక్రియను సరళీకృతం చేయడం,పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించడం, ఖనిజ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం జరిగిందని ఎంపీ వద్దిరాజు వివరించారు. సహజ వనరులను ప్రాంతీయాభివృద్ధి, ఉపాధి కల్పనకు ఉపయోగించే దిశగా గత ప్రభుత్వం విశేష కృషి చేసిందన్నారు.అయితే, ప్రస్తుతం ఉన్న రాష్ట్ర ప్రభుత్వంలో పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. మన దేశానికిప్పుడు శాస్త్రీయ ఖనిజ అన్వేషణ, పర్యావరణ హితమైన తవ్వకాలు, డిజిటల్ పర్యవేక్షణ, దేశంలోనే విలువ ఆధారిత పరిశ్రమల అభివృద్ధి, పారదర్శక పరిపాలన అవసరమని ఆయన పేర్కొన్నారు.ఖనిజాలను తవ్వడం మాత్రమే కాదని,వాటి ఆధారంగా స్వయం సమృద్ధిగల తయారీ వ్యవస్థను నిర్మించడం కూడా మన లక్ష్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.తాడిచర్ల బొగ్గు గనిని సింగరేణి సంస్థకు అప్పగించడం పట్ల ఎంపీ రవిచంద్ర సంతోషం వ్యక్తం చేస్తూ సభలో ఉన్న మంత్రి కిషన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా,కోయగూడెం, మణుగూరు,శ్రావణపల్లి గనులను కూడా సింగరేణి సంస్థకు కేటాయించాల్సిందిగా మంత్రిని కోరారు,దీంతో వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. పెట్టుబడుల ప్రోత్సాహం, పర్యావరణ పరిరక్షణ ఖనిజ సంపద కలిగిన రాష్ట్రాల హక్కుల మధ్య సమతుల్యతను కాపాడాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ ఈ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతునిస్తున్నదని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు.

# శ్రావణమాసం తొలి శుక్రవారం అమ్మవార్ల అలంకరణలు





నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 14 (డీకే చాటింపు):ఇందూరు (నిజామాబాద్) నగరంలో శ్రావణ మాస తొలి శుక్రవారం అమ్మవార్ల అలంకారా లతో భక్తులతో దేవాలయాలు సందడిగా మారాయి. గంగస్తాన్ 2 లక్ష్మీ దేవి టెంపుల్, దేవీ రోడ్ లోని నల్ల పోచమ్మ దేవాలయం , వీక్లీ మార్కెట్ పెద్ద పోచమ్మ , ముబారక్ నగర్ పెద్దమ్మ తల్లి దేవాలయాలను ముస్తాబుగా పూజారులు అలంకరించారు.ప్రతి శుక్రవారం అన్న ప్రసాదం ఉంటుందని లక్ష్మీదేవి ఆలయ పూజారి రాకేష్ తెలిపారు.

# హర్ ఘర్ తిరంగా స్ఫూర్తితో గడ్డిఅన్నారం డివిజన్‌లో ఘనంగా తిరంగా ర్యాలీ..




ఎల్బీనగర్, ఆగస్టు 14 (డీకే చాటింపు) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు శ్రీ దాసరి జయ ప్రకాష్ ఆధ్వర్యంలో ఈరోజు ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బీజేపీ రంగారెడ్డి (అర్బన్) జిల్లా అధ్యక్షులు శ్రీ వనపల్లి శ్రీనివాస్ రెడ్డి , బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ సామ రంగారెడ్డి గారు, గడ్డిఅన్నారం డివిజన్ తాజా మాజీ బీజేపీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు.నేతాజీ నగర్‌లోని చైతన్య టెక్నో స్కూల్ నుంచి వి.వి. నగర్ బస్ స్టాప్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో ఎస్.ఆర్.కె.ఎస్ విద్యాలయ హై స్కూల్, శ్రీ చైతన్య టెక్నో స్కూల్, సుమేధా మోడల్ హై స్కూల్, పాననీయ మహావిద్యాలయ హై స్కూల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు చేతుల్లో జాతీయ జెండాలను పట్టుకుని, దేశభక్తి నినాదాలతో ర్యాలీలో పాల్గొని జాతీయ సమైక్యత, దేశభక్తి స్ఫూర్తిని చాటారు.ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ.. తిరంగా కేవలం ఒక జెండా కాదని, కోట్లాది భారతీయుల గౌరవం, త్యాగం, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడం ద్వారా దేశంపై మనకున్న గౌరవాన్ని చాటాలని పిలుపునిచ్చారు. యువత, విద్యార్థుల్లో దేశభక్తి భావాలను మరింత పెంపొందించేందుకు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రజలందరూ భాగస్వాములై విజయవంతం చేసి, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి.. దేశమే ప్రథమం -- జాతీయ జెండానే గర్వం అనే స్ఫూర్తిని చాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చిలుకూరి రామ్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మురళి, కసం రామ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజేశ్వరి, శ్రీధర్ రెడ్డి, నగేష్, భీష్మాచారి, సుబ్బారెడ్డి, సిరి రెడ్డి, సందీప్, మహేందర్ రాజు, సతీష్ చారీ, రత్నం, వివేక్, వివేక్ చారీ, శ్రీకాంత్, శ్రీనివాస్, శివ రామ్, సంతు నాయక్, హరీష్ రాహుల్, సిద్దు, టీంకు, వంశీ గంగపుత్ర, రఘునందన్ జోషి, పవన్, సాయి రెడ్డి తదితరులు ఎస్‌ఆర్కేఎస్ విద్యాలయ హై స్కూల్, శ్రీ చైతన్య టెక్నో స్కూల్, సుమేధా మోడల్ హై స్కూల్, పాననీయ మహావిద్యాలయ హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## భవ్య ధాత్రి

మహిమాన్విత భారతీయ
ప్రతాపమీ పతాకం..
జన జాగృత హృదయాలయ
ప్రకాశమీ త్రివర్ణం.
తపోమునులు త్యాగ ధనులు
మహనీయుల జ్ఞాన ఫలం
చెరగని తరగని వెలుగుల
భవ్య ధాత్రి భారతం...
మహిమాన్వితచ

మహామహుల త్యాగ దీప్తి కాషాయం
శాంత భరిత భరత చరిత
ధవళం
పల్లవించు ప్రకృతి యై
పలకరించు హరితం...
మహిమాన్వితచ
భరతావని పదపదాన
శిరమెత్తిన రాగ మణులు..
జన గణ భారత వనిలో
గళమెత్తిన స్వర ఝరులు..
మహిమాన్వితచ
తరతరాల సంస్కృతీ సభ్యతలే
భావ నిధులు..
జయ జయ భారత గీతపు
శృతి లయలే జీవ నదులు..
మహిమాన్వితచ


వెల్మల జయపాల్ రెడ్డి
కరీంనగర్
9441168976

# ప్రతి భారతీయుని ఇంటి పైన త్రివర్ణ పతాకం....



నిజామాబాదు విలేకరి ఆగస్టు14(డికే చాటింపు) భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోడీ పిలుపుమేరకు ప్రతి ఒక్క భారత పౌరుడు వారి వారి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగుర వేయాలని పిలుపుమేరకు బీజేపీ ఇందూర్ అర్బన్ అసెశీబ్లీ మాజీ కో కన్వీనర్ రాగి నారాయణ యాదవ్ మరియు 36 డివిజన్ బి జె పి కార్పొరేటర్ రేవతి పరమేశ్వర్ త్రివర్ణ పతాకం ఎగరవేయడం జరిగింది. గూపాన్ పల్లి శివారులో సీ యెన్ ఆర్ హోమ్స్ లో హర్ గర్ తిరంగా జండా ఎగురవేశారు. జండా కార్యక్రమం లో బిల్డర్ చిటికెల నారాయణరెడ్డి,కిరణ్ ,గిరిరాజ్, రామయ్య ,చిన్నారెడ్డి,సత్యనారాయణ,ప్రభాకర్, జగన్మోహన్ రెడ్డి, మధుసూదన్ రావు లు పాల్గొన్నారు.

# గంగస్తాన్ 2రోడ్లు ,డ్రైనేజీల తో ఇక్కట్లు



నిజామాబాద్ ప్రతినిధి ఆగస్టు 14(డీ కే చాటింపు) నిజామాబాద్ కార్పొరేషన్ పరిధి 3వ డివిజన్ గంగా స్థాన్ 2 కాలనీ లో పలు సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారి నుండి వాగు బ్రిడ్జి వరకు రోడ్ అధ్వాన్నంగా ఉంది. నగరంలో అతి పెద్ద కాలనీ అయినా ఎటువైపు అధికారుల,ప్రజా ప్రతినిధుల చూపు కరువైంది.కాలనీ లో ఇంటర్నల్ గా 11 రోడ్లు, ఫేస్ 3 కాలనీ , బైపాస్ కు వెళ్ళే రహదారి,ప్రసిద్ధ పుణ్య క్షేత్రం ఉత్తర తిరుపతి ఆలయం ఉంది.వర్షం పడితే డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేక నీరు నిలిచి చెరువులు తలపిస్తున్నాయి దోమలకు నిలయాలుగా మారుతున్నాయని రోడ్ నెంబర్ 8,9,10&11 ప్రాంత కాలనీ వాసులు అల్లొల్ల శ్రీనివాస్ రెడ్డి , ప్రదీప్, సాయిప్రసాద్, జీవన్ గుప్తా కాలనీ వాసులు వాపోయారు.



# మళ్లీ జలజగడం



**హైదరాబాద్,** ,తెలంగాణలో ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే సెంటిమెంట్ రగులుతోంది. ప్రధానంగా "నీటి సెంటిమెంట్" తో ప్రతిపక్ష బీఆర్ఎస్ అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని ప్రయత్నిస్తుంది. తెలంగాణకు దక్కాల్సిన నీటిని ఏపీకి తరలిస్తున్నారని, గోదావరి, కృష్ణా నదీ జలాలపై రగడ మొదలయింది. తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్ కు తాకట్టు పెడుతున్నారంటూ గులాబీ పార్టీ కాంగ్రెస్ పై మండి పడుతుంది. తన గురువు చంద్రబాబు కోసం గోదావరి, కృష్ణా నీటిని తెలంగాణకు దక్కకుండా ఏపీకి తరలించుకు పోతున్నా మౌనంగా ఉంటున్నారని ఆరోపణలను గుప్పిస్తుంది. దీనికి కాంగ్రెస్ పార్టీ ఘాటుగా కౌంటర్ ఇస్తుంది.తెలంగాణ చరిత్ర తెలంగాణ రాజకీయాల్లో 'నీళ్లు' అనేది కేవలం వనరు మాత్రమే కాదు, ఉద్యమ పునాది నుంచి బలమైన భావోద్వేగ సెంటిమెంట్. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో "నీళ్లు, నిధులు, నియామకాలు" నినాదంలో నీళ్లే ప్రథమ స్థానంలో నిలిచాయి. సమైక్య రాష్ట్రంలో ప్రాజెక్టుల విషయంలో జరిగిన అన్యాయాన్ని ఎత్తిచూపుతూ రాజకీయ పార్టీలు ఎప్పుడూ ప్రజలను ఏకం చేస్తుంటాయి. తెలంగాణ ఉద్యమం వచ్చిందే నీళ్లు, నిధులు, నియామకాలు. సెంటిమెంట్ మానంగా దక్కాల్సిన కృష్ణా, గోదావరి జలాలు పాలకుల నిర్లక్ష్యంతో సీమాంధ్రకు తరలిపోయాయనే ఆవేదన తెలంగాణ సమాజంలో ఉండేది. తాగు, సాగునీరు అందక ఎండిన భూములు, వలసల నేపథ్యమే తెలంగాణ రాజకీయ అస్తిత్వానికి ప్రధాన ప్రాతిపదికగా మారింది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా నీటి హక్కుల రక్షణే ప్రధాన అజెండాగా సాగుతోంది. గోదావరి, కృష్ణా నదీ జలాల కేటాయింపులు, బోర్డుల సమావేశాల అజెండాలు రాష్ట్రంలో తరచూ తీవ్ర రాజకీయ రగడకు దారితీస్తున్నాయి.పక్క రాష్ట్రాల ప్రాజెక్టుల విస్తరణ లేదా కొత్త ప్రతిపాదనలు పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుల విషయంలో కేంద్రం వద్ద రాష్ట్ర ప్రయోజనాలను కాపాడుకోవడంలో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధాలు జరుగుతున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తమదే నీటి హక్కుల పరిరక్షణ అంటుంటే, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ తదితర ప్రతిపక్షాలు సెంటిమెంట్ అస్త్రం ప్రయోగిస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఎత్తిపోతల పథకాల ప్రారంభాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక శక్తిగా ఉంటాయి.నీటి కేటాయింపుల్లో అన్యాయం జరుగుతోందనే చిన్న సంకేతం కూడా తెలంగాణలో వెంటనే బలమైన రాజకీయ వ్యతిరేకతను, సెంటిమెంట్‌ను రగిలిస్తుంది. మరి ఈ సెంటిమెంట్ ఎప్పటి వరకూ కొనసాగిస్తారో.. ఎవరు అధిగమించి అధికారాన్ని చేపడతారో చూడాల్సి ఉంది.

# బీజేపీతో మళ్లీ పొత్తుకు శిరోమణి అకాలీదళ్ పార్టీ ప్రయత్నాలు

**ఏప్రిల్‌లో పశ్చిమ** బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేంద్రంలోని మోదీ సర్కారు ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటుచేసి, నియోజకవర్గాల పునర్విభజన మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చింది. అయితే, ఈ రాజ్యాంగ సవరణ బిల్లు మూడింట రెండొంతుల మెజార్టీ సాధించలేక వీగిపోయింది. దీంతో మరోసారి ఈ బిల్లును తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలోనే మద్దతు కూడగట్టి, ఎలాగైనా గట్టెక్కించాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే బిల్లుకు తాజాగా ఎస్ఏడీ మద్దతు ప్రకటించింది.బీజేపీ, అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తుందనే ఊహాగానాల నడుమ కేంద్రంలోని మోదీ సర్కారు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్న డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుకు పంజాబ్‌కు చెందిన ప్రాంతీయ పార్టీ శిరోమణి అకాలీదళ్ బహిరంగంగా మద్దతు ప్రకటించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అకాలీదళ్ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ భేటీ అయిన మర్నాడే ఈ ప్రకటన వెలువడింది. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. అకాలీదళ్.. బీజేపీ కూటమి ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయని ఈ నిర్ణయం స్పష్టమైన సంకేతాన్ని ఇస్తోంది.కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ ప్రణాళికను సమర్థిస్తూ.. దేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని బాదల్ శనివారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల్లో స్థానాలను సమానంగా 50 శాతం పెంచాలనే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఎస్ఏడీ మద్దతు ఇస్తుందని తెలిపారు. "చండీగఢ్‌లో జరిగిన పార్టీ సీనియర్ నేతల సమావేశంలో మహిళా రిజర్వేషన్ల బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశాం.. మహిళల గౌరవం, సమానత్వం, సమాన హక్కుల కోసం పోరాడిన సిక్కు గురువుల బోధనల నుంచి శిరోమణి అకాలీదళ్ స్ఫూర్తి పొందుతుంది. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ ఇప్పటికే తన సభలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి ఆదర్శంగా నిలిచింది. పార్లమెంట్ ముందుకు వచ్చిన కీలక అంశాలపై చర్చించిన అనంతరం, అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించేలా న్యాయమైన డిలిమిటేషన్ జరగాలని భావిస్తున్నాం. పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'అన్ని రాష్ట్రాల్లో 50% స్థానాల సమాన పెంపు' ప్రతిపాదనకు మేము మద్దతు ఇస్తున్నాం' అని బాదల్



వెల్లడించారు. ఏప్రిల్‌లో పార్లమెంట్‌లో డిలిమిటేషన్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టినప్పుడు అకాలీదళ్ దానిని తీవ్రంగా వ్యతిరేకించి, ప్రతిపక్షాలతో కలిసి వ్యతిరేకంగా ఓటు వేసింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే పంజాబ్‌కు తక్కువ స్థానాలు పెరుగుతాయని, ఇది పంజాబ్‌కు వివక్షపూరితమైనదని అప్పట్లో పేర్కొంది. కానీ, ఇప్పుడు పొత్తు చర్చలు వేగం పుంజుకోవడంతో 50% స్థానాల పెంపు హామీతో ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించింది.2020లో వివాదాస్పద వ్యవసాయ చట్టాలతో బీజేపీ, అకాలీదళ్ మధ్య దాదాపు రెండున్నర దశాబ్దాల బంధం తెగిపోయింది. ఆ సమయంలో ఎన్డీయే కూటమి నుంచి అకాలీదళ్ బయటకు వచ్చింది. ఆ తర్వాత 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఇరు పార్టీలు ఒంటరిగానే పోటీ చేశాయి. 2024 ఎన్నికల్లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేకపోగా, అకాలీదళ్ కేవలం ఒక స్థానానికే పరిమితమైంది.పార్లమెంట్‌లో ప్రధానితో బాదల్ శుక్రవారం భేటీ కావడంతో కూటమి పునరుద్ధరణపై ప్రచారం మొదలైంది. పంజాబ్ బీజేపీ వర్గాలు, ఎస్ఏడి, ఆర్ఎస్ఎస్‌లతో పాటు కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన నేతలు కూడా పొత్తుకు అనుకూలంగా ఉన్నారు. దీనిపై బీజేపీ కేంద్ర నాయకత్వమే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.గతంలో అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషించగా.. బీజేపీ చిన్న భాగస్వామిగా ఉండేది. కానీ, ఈసారి సమాన ప్రాతిపదికన పొత్తు ఉండాలని బీజేపీ కోరుతున్నట్లు సమాచారం. సీట్ల సర్దుబాటు వంటి వివరాలను తర్వాత చర్చించవచ్చని, పంజాబ్ పరిస్థితులను మెరుగుపరచడమే ప్రస్తుతం తమ ప్రాధాన్యత అని అకాలీదళ్ నేతలు చెబుతున్నారు

# రెంట్ బాయ్‌ఫ్రెండ్ తో జరాభద్రం



**హైదరాబాద్,** ,సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసే హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్.. సోషల్ మీడియాలో జరుగుతున్న మరో మోసంపై యువతను అప్రమత్తం చేశారు. రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో నెట్టింట జరుగుతున్న ప్రచారం వెనుక ఉన్న మోసాలను వివరిస్తూ అమ్మాయిలు, యువతులను అలర్ట్ చేశారు. ఆకర్షణీయమైన కుర్రాళ్ల ఫోటోలు పెట్టి, అమ్మాయిలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. ఇలాంటి కేటుగాళ్ల వలలో పడొద్దంటూ హెచ్చరించారు. ఇలాంటి మోసాలను గమనిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచించారు.సోషల్ మీడియాలో జరిగే మోసాల నుంచి సైబర్ నేరాల వరకూ ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తుంటారు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్. ముఖ్యంగా యువతీ, యువకులు మోసాలకు గురికాకుండా సోషల్ మీడియా ద్వారావారిని అలర్ట్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే రెంట్ బాయ్‌ఫ్రెండ్ పేరుతో నెట్టింట జరుగుతున్న మోసాలపై మరోసారి యువతను అప్రమత్తం చేశారాయన. ఆగస్ట్ నెలలో రెంట్ బాయ్‌ఫ్రెండ్ ఆఫర్ల పేరుతో సైబర్ నేరగాళ్లు వల వేసేందుకు సిద్ధంగా ఉన్నారని.. అలర్ట్‌గా ఉండాలని అమ్మాయిలకు సూచించారు.ఒంటరితనంతో బాధపడుతున్నారా? మీతో కాఫీ తాగడానికి, సినిమాకెళ్లడానికి అందమైన అబ్బాయి కావాలా? అది కూడా 50 శాతం ఆఫర్లతో అంటూ సోషల్ మీడియాలో కలర్‌ఫుల్‌గా కనిపించే పోస్టర్ల వెనుక సైబర్ మోసం దాగి ఉందని.. అమ్మాయిలు, యువతులే లక్ష్యంగా సైబర్ కేటుగాళ్లు విసురుతున్న కొత్త డేటింగ్ ట్రాప్ ఇదంటూ సజ్జనార్ హెచ్చరించారు. ఫేస్ బుక్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా మాధ్యమాల్లోఆకర్షణీయంగా ఉండే అబ్బాయిల ఫోటోలను చూపిస్తూ.. కాఫీ మీటింగ్, సినిమా డేట్, షాపింగ్, ఈవెంట్లు, పెళ్లిళ్లు, ఫుల్ డే ప్యాకేజీ అంటూ కేటుగాళ్లు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని.. గోప్యత, భద్రత పాటిస్తామని, అక్రమ వ్యాపారం కాదని నమ్మబలుకుతూ బుకింగ్స్ కోసం డైరెక్ట్ మెసేజ్ చేయాలని కోరుతూ నెట్టింట ప్రచారం చేస్తున్నారని సజ్జనార్ వివరించారు."ఏఐతో సృష్టించిన, ఇంటర్నెట్ నుంచి సేకరించిన అందమైన కుర్రాళ్ల ఫోటోలను ప్రొఫైల్ పిక్చర్లుగా పెట్టి, మెసేజ్ చేసిన అమ్మాయిలతో తియ్యటి మాటలతో సంభాషణలు మొదలుపెడతారు. బుకింగ్ కన్ఫర్మేషన్, సెక్యూరిటీ డిపాజిట్, అడ్వాన్స్ అమౌంట్ పేరుతో డిజిటల్ వ్యాలెట్లు, క్యూఆర్ కోడ్ల ద్వారా వేలాది రూపాయలు వసూలు చేసి, ఆపై అకౌంట్లను బ్లాక్ చేస్తారు. ఆన్‌లైన్ సంభాషణలు నమ్మి అపరిచిత వ్యక్తులను నేరుగా కలవడానికి వెళ్తే వారు మిమ్మల్ని సులభంగా ట్రాప్ చేసే ప్రమాదం ఉంది. ప్రేమ పేరుతో అబద్ధాలు చెప్పి మోసం చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చాటింగ్ క్రమంలో చాకచక్యంగా సేకరించిన ఫోన్ నంబర్లు, వ్యక్తిగత ఫోటోల ఆధారంగా ఆ తర్వాత బెదిరింపులకు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడే అవకాశం ఉంది." అని సజ్జనార్ యువతులు, అమ్మాయిలను అప్రమత్తం చేశారు.సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ రకమైన మోసపూరిత ప్రకటనలపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం దృష్టిసారించిందని.. వీటికి బాధ్యులైన వారిపై వేగంగా దర్యాప్తు చేసి.. చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ విషయంలో అమ్మాయిలతో పాటుగా, వారి తల్లిదండ్రులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని.. తమ పిల్లలు సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు చూస్తున్నారు? ఎవరితో మాట్లాడుతున్నారు? బయట ఎవరిని కలుస్తున్నారు? అనే అంశాలపై తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు.సోషల్ మీడియాలో ఇలాంటి కేటుగాళ్లు ఇచ్చే డిస్కౌంట్ ఆఫర్లను చూసి మోసపోవద్దని.. అపరిచిత వ్యక్తులతో చాటింగ్, కలవడం కానీ చేయవద్దని సూచించారు. ఎవరైనా ఇలాంటి సైబర్ కేటుగాళ్ల బారినపడినా, లేదా అనుమానాస్పద పోస్టులు గమనిస్తే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 కి కాల్ చేయాలని.. లేదంటే ఇ.ఎవవతీఇతీతిఎవ.ఇనీల.తిని పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సూచించారు.

# బీసీల సెంట్రిక్ గా కవిత




**హైదరాబాద్,** , తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త పార్టీ పెట్టుకున్న మాజీ ఎంపీ, మాజీ సీఎం కేసీఆర్ తనయ కవిత.. ఇప్పుడు వ్యూహం మార్చుకున్నట్టు తెలుస్తోంది. నిన్న మొన్నటి వరకు తెలంగాణ సెంటిమెంటు, ఉద్యమ కారులు.. వారి హక్కులు, ఉద్యోగాలు అంటూ.. రాజకీయ నినాదాలు చేసిన కవిత.. వీటి వల్ల వర్కవుట్ కాదని అర్థం చేసుకున్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆమె.. తన పంథాను సమూలంగా మార్చుకు న్నట్టు కనిపిస్తున్నారు.ప్రస్తుతం తెలంగాణలో బీసీ సామాజిక వర్గం అధికారిక లెక్కల ప్రకారం.. 43 శాతం మంది ఉన్నారు. అనధికారికంగా 50 శాతం వరకు ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీలను తనవైపు తిప్పుకునే దిశగా కవిత రాజకీయాలకు పదును పెట్టినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం బీసీ ఓటు బ్యాంకు నికరంగా ఎవరికీ ఎడాప్ట్ కాలేదు. బీఆర్ఎస్ అయినా.. బీసీ గణనను తొలిసారి నిర్వహించామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీకైనా బీసీలు పూర్తిగా అంకితం కాలేదు. ఈ నేపథ్యంలో వారిని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు కవిత ప్రయత్నం చేస్తున్నారు.ఈ నేపథ్యంలోనే బీసీల హక్కుల సాధన, ఏపీలో చేస్తున్న బీసీల రక్షణ హక్కు చట్టం తరహాలో తెలంగాణలోనూ బీసీలకు రక్షణ హక్కు తీసుకురావాలని ఆమె డిమాండ్ చేస్తున్నారు. అంతేకాదు.. రాజకీయంగా అదేవిధంగా రాజ్యాంగ పరంగా కూడా.. బీసీలకు 50 శాతం పదవులు కేటాయించాలని కోరుతున్నారు. వాస్తవానికి కవిత బీసీ కాకపోయినా.. ఆ వర్గాన్ని తనదైన శైలిలో తనవైపు తిప్పుకొనేందుకు బీసీల సమస్యలను భుజాని వేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం నినాదాలకే పరిమితం కారాదని కూడా కవిత నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది.బీసీల కోసం ఉద్యమం చేయాలనే దిశగా కవిత ఆలోచన చేస్తున్నారు. ముఖ్యంగా పార్లమెంటు నుంచే ఆమె పని ప్రారంభించనున్నట్టు తెలుస్తోంది. గతంలో తెలంగాణ సాధన కోసం కేసీఆర్ వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించిన తరహాలో బీసీల కోసం.. వెయ్యి కార్లతో పార్లమెంటుకు పెరేడ్ నిర్వహించి.. ఢిల్లీ నుంచే తన వ్యూహాన్ని పెంచాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన కార్యాచరణపై ప్రస్తుతం కవిత కసరత్తు చేస్తున్నారు. ఇది అయిన తర్వాత.. రాష్ట్ర వ్యాప్తంగా బీసీల కోసం ఉద్యమం నిర్మించి.. జిల్లాల వారీగా పర్యటనలు చేయాలనినిర్ణయించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరి ఇది ఏమేరకు వర్కవుట్ అవుతుందో చూడాలి.

# 95 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ కు గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్,** , ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటులో కీలక ముందడుగు పడింది. రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా 100 టీపీఎస్‌లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా.. ఇప్పటికే తొలి మోడల్ పాఠశాలగా రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో ఏర్పాటు చేసిన స్కూల్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో విద్య అందించేలా సదుపాయాలు కల్పించారు.తాజాగా మరో 95 పాఠశాలల నిర్మాణానికి సంబంధించిన ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. వీటి నిర్మాణానికి మొత్తం రూ.928 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఒక్కో పాఠశాలకు భూమి, భవన పరిమాణం, మౌలిక సదుపాయాలను బట్టి సుమారు రూ.8 కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు ఖర్చు కానుంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో అంచనాలు రూపొందించి పాఠశాల విద్యాశాఖకు పంపించారు.95 పాఠశాలల నిర్మాణాలకు అవసరమైన పరిపాలనా అనుమతుల కోసం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ముఖ్యమంత్రి ఆమోదం అనంతరం ఉత్తర్వులు వెలువడితే టెండర్ల ప్రక్రియ ప్రారంభించే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా పనులు మొదలుపెట్టి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా 2027-28 విద్యా సంవత్సరం నుంచి పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్ విద్యను విలీనం చేయాలన్న నిర్ణయం నేపథ్యంలో టీపీఎస్‌ల నిర్మాణానికి ప్రాధాన్యం పెరిగింది.ఈ పాఠశాలలకు అవసరమైన నిధుల్లో 70 శాతం, అంటే సుమారు రూ.650 కోట్లను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ రుణం ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. మిగిలిన 30 శాతం నిధులను రాష్ట్ర బడ్జెట్ నుంచి కేటాయించనున్నారు.




విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏఐఐబీ, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నుంచి భారీగా రుణాలు సమీకరించే ప్రణాళికలో భాగంగానే ఈ నిధులను వినియోగించనుంది. రుణం అందడంలో ఆలస్యం ఏర్పడినా పనులు ఆగిపోకుండా రాష్ట్ర నిధులతో తొలిదశ నిర్మాణ పనులను ప్రారంభించాలని అధికారులు యోచిస్తున్నారు. ఏఐఐబీ తరఫున కన్సల్టెన్సీ ప్రతినిధులు రాష్ట్రంలో పర్యటిస్తూ సంబంధిత అధికారులతో ప్రాజెక్టు అమలు, మౌలిక సదుపాయాలు, నిర్మాణ ప్రమాణాలపై చర్చలు జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.టీపీఎస్‌లను కేవలం పాఠశాల భవనాలుగా కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనువైన క్యాంపస్‌లుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. కనీసం నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే కొనసాగుతున్న ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్య అందించేలా మౌలిక వసతులు కల్పించనున్నారు. తరగతి గదులతోపాటు డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, లైబ్రరీలు, ఆధునిక సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు అవసరమైన వసతులు, రవాణా సౌకర్యాలను కల్పించనున్నారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే ఆధునిక తరగతి గదులు, లైబ్రరీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాసులు, క్రీడా వసతులు, ఉచిత రవాణా వంటి సదుపాయాలను అందుబాటులోకి తెచ్చారు.విద్యార్థులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించడంతోపాటు పాలు కూడా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# తెలంగాణ కేబినెట్ విస్తరణకు హైకమాండ్ గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్,** , తెలంగాణ కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. విస్తరణకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతుంది. ఈ దఫాలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేయడంతోపాటు ప్రస్తుత మంత్రుల శాఖల మార్పునకు అకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయితే, కేబినెట్ నుంచి ఒకరికి ఉద్వాసన పలుకుతారని గతంలో ప్రచారం జరిగినప్పటికీ.. ప్రస్తుతం ఆమేరకు అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశం అందరిలో ఉత్కంఠ నెలకొంది.పక్క రాష్ట్రమైన కర్ణాటలో మంత్రివర్గ విస్తరణ పూర్తయిన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం తన ఫోకస్‌ను తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పెట్టినట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. పలువురు సీనియర్, జూనియర్ ఎమ్మెల్యే మంత్రి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు మంత్రి పదవి ఇవ్వాలంటూ ఇప్పటికే పలు దఫాలుగా కేంద్ర పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పలు సందర్భాల్లో బహిరంగంగానూ మంత్రి పదవి దక్కలేదని తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇలా పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యే మంత్రి పదవి కోసం తమవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే, ఈసారి కేబినెట్ విస్తరణలో ఎవరికి అదృష్టం వరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.కేబినెట్ విస్తరణకు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే ఈ దఫాలో ఖాళీగా ఉన్న రెండు బెర్తులను భర్తీ చేయడంతో పాటు ప్రస్తుత మంత్రుల శాఖల మార్పునకు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. రెండు బెర్త్ లలో ఎస్టీ, రెడ్డి సామాజిక వర్గాల వారికి చాన్స్ దక్కే అవకాశం ఉంది. ఎస్టీ సామాజిక వర్గం నుంచి రేసులో రామచంద్రు నాయక్, బాలు నాయక్ లు ఉన్నట్లు సమాచారం. వీరిలో ఒకరికి మంత్రి పదవి దక్కేఅ వకాశాలు ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు.. రెడ్డి సామాజిక వర్గం నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్



రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, సుందర్శన్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డిల పేర్లు వినిపిస్తున్నాయి.తెలంగాణ కేబినెట్లో ప్రస్తుతం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఎలాంటి ప్రాతినిధ్యం లేదు. స్పీకర్‌గా గడ్డం ప్రసాద్‌కుమార్ కొనసాగుతున్నారు. అయితే, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు మంత్రి పదవి కేటాయించాలని స్థానిక నేతలు కోరుతున్నారు. అధిష్టానం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రాధాన్యం ఇస్తే.. ఆ జిల్లాకు చెందిన మల్ రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డిలలో ఎవరికో ఒకరికి మంత్రి పదవి దక్కే అవకాశం ఉందన్న చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. మరోవైపు.. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రేసులో సుందర్శన్ రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. మరో పది రోజుల్లో మంత్రివర్గ విస్తరణ ప్రక్రియ పూర్తవుతుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటుండగా.. వీరిలో ఎవరిని మంత్రి పదవి వరిస్తుందనేది ఉత్కంఠగా మారింది.ఈసారి మంత్రి వర్గ విస్తరణలో భాగంగా ప్రస్తుత కేబినెట్‌లో కొనసాగుతున్న వారిలో ఒకరికి ఉద్వాసన పలికే అవకాశాల ఉన్నట్లుగా ఇటీవల కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరిగింది. అయితే, ఇప్పుడు అలాంటిదేమీ లేదని తెలుస్తోంది. ఒకవేళ ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న ఒకరికి ఉద్వాసన పలికితే అదే సామాజిక వర్గం నుంచి మరొకరికి చాన్స్ దక్కే అవకాశాలు ఉన్నాయి.ల

# బిగ్ ప్లాన్‌లో బీజేపీ

**హైదరాబాద్**,తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ తన వ్యూహాలకు పదును పెడుతోంది. దక్షిణ భారతదేశంలో కర్ణాటక తర్వాత పట్టు సాధించేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న కమలనాథులు, ఈసారి ఎలాగైనా తెలంగాణ గద్దెనెక్కాలనే స్పష్టమైన దిశానిర్దేశంతో ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఢిల్లీ వేదికగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సమక్షంలో జరిగిన కీలక సమీక్షా సమావేశం, రాబోయే రోజుల్లో బీజేపీ అనుసరించబోయే రాజకీయ వ్యూహానికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్‌ను అందించింది.తెలంగాణ బీజేపీకి ప్రధాన ప్రతిబంధకంగా మారిన పాత, కొత్త నేతల మధ్య విభేదాలను, అంతర్గత కలహాలను వెంటనే పక్కన పెట్టాలని పార్టీ అధిష్ఠానం స్పష్టం చేసింది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, డీకే అరుణ, కొండ విశ్వేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్, రఘునందన్ రావు సహా ముఖ్య నేతలందరూ ఒకే తాటిపైకి వచ్చి పోరాడాలని అధిష్ఠానం స్పష్టం చేసింది. గతంలో కరీంనగర్, మేడ్చల్ అర్బన్, వికారాబాద్ జిల్లాల పార్టీ అధ్యక్షుల నియామకంపై నలుగుతున్న వివాదాలను సైతం బండి సంజయ్, ఈటల రాజేందర్, కొండ విశ్వేశ్వర్ రెడ్డిల సూచనలకు ప్రాధాన్యం ఇస్తూ సర్దుబాటు చేయడం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఐక్యతను నింపే ప్రయత్నం జరిగింది.భవిష్యత్తులో బీఆర్ఎస్ లేదా ఇతర పార్టీలతో పొత్తులు ఉంటాయనే ప్రచారాలకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముగింపు పలికారు. రాబోయే ఎన్నికల్లో జీహెచ్ఎంసీ సహా ఏ ఎన్నికల్లోనైనా తెలంగాణలో ఏ ఇతర పార్టీతోనూ పొత్తు ఉండదని, ఒంటరిగానే పోటీ చేస్తామని తేల్చి చెప్పారు. జాతీయ స్థాయిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో సమీకరణాలు వేరైనా, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, పార్టీ స్వయం సమృద్ధి దృష్ట్యా ఒంటరి పోరాటమే శ్రేయస్కరమని పార్టీ భావిస్తోంది. గత ఎన్నికల్లో 119 నియోజకవర్గాల్లో గణనీయమైన ఓటు బ్యాంకు సాధించామని, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం సీట్ల సంఖ్య పెరిగితే సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంత సత్తా సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజల్లో ఉన్న అసంతృప్తిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా బీజేపీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ప్రధానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, యువత సమస్యలపై పార్టీ అసెంబ్లీ కన్వీనర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి నాయకత్వంలో ధర్నాలు, నిరసనలు చేపడుతోంది. దీనికి తోడు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలైన 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' వంటి ఫలాలను పేదలకు చేరకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు.మండల స్థాయి నుంచి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల వరకు ప్రతి నెలా నిలకడగా సమీక్షలు నిర్వహిస్తూ, ప్రతీ మూడు నెలలకోసారి కేంద్రీయ నేతలు రాష్ట్రాన్ని సందర్శించేలా పక్కా ప్రణాళిక రూపుదిద్దుకుంది. నేతల మధ్య ఉన్న చిన్న చిన్న భేదాభిప్రాయాలు పక్కనబెట్టి, వ్యూహాత్మకంగా ముందుకు సాగితే తెలంగాణ పీఠం దక్కడం అసాధ్యమేమీ కాదని కమలనాథులు భావిస్తున్నారు.బండి సంజయ్ నివాసంలో సమావేశాలు..బీజేపీ అధిష్ఠానం తెలంగాణ రాజకీయాల్లో మరో మలుపు తీసుకుంటూ వ్యూహాత్మకంగా కదులుతోంది. ఒకవైపు వచ్చే ఏడాది ఎన్నికలు జరిగే పంజాబ్, గుజరాత్‌లో గెలుపుపై దృష్టి సారించిన కమలం పార్టీ మరోవైపు దరక్షిణాన పట్టు బిగించే ప్రయత్నం చేస్తోంది. ఇందులో భాగంగా కర్ణాటక తర్వాత గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉన్న తెలంగాణలో పార్టీలో జోష్ పెంచడంతోపాటు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేలా వ్యూహాలు రూపొందిస్తోంది. త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, రాబోయే



అసెంబ్లీ పోరులో విజయం సాధించాలనే లక్ష్యంతో కేంద్ర స్థాయి నుంచి స్పష్టమైన దిశానిర్దేశం జరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఢిల్లీని వేదికగా రాష్ట్ర నాయకుల సమావేశాలు జరగడం, పార్టీలో సమన్వయాన్ని పెంచే ప్రయత్నాలు ఈ వ్యూహానికి ప్రధాన అంశాలుగా మారాయి.పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు రెండింటిలోనూ బలమైన పనితీరు చూపాలనే ఆలోచనతో బీజేపీ అధిష్టానం పని చేస్తోంది. హైదరాబాద్‌లోని మున్సిపల్ ఎన్నికలు పార్టీకి కీలక పరీక్షగా మారనున్న నేపథ్యంలో, రాష్ట్ర స్థాయి నాయకత్వం, కార్యకర్తల సమన్వయం, సంస్థాగత బలం పెంచే దిశగా చర్చలు సాగుతున్నాయి. కేవలం ఎన్నికల క్యాంపెయిన్‌కు మాత్రమే పరిమితం కాకుండా, దీర్ఘకాలిక రాజకీయ బలాన్ని నిర్మించే దృష్టితో వ్యూహాలు రూపొందుతున్నట్లు అర్థమవుతోంది.ఢిల్లీలోని కేంద్ర మంత్రి బండి సంజయ్ నివాసం రాష్ట్ర నాయకుల సమావేశాలకు ముఖ్య వేదికగా మారింది. ఇక్కడ జరుగుతున్న చర్చలు కేవలం సాధారణ సమావేశాలుగా కాకుండా, భవిష్యత్ కార్యాచరణపై కీలక నిర్ణయాలకు దారితీస్తున్నాయి. రాష్ట్ర స్థాయి నాయకులు, కేంద్ర నాయకత్వం మధ్య నేరుగా సంప్రదింపులు జరగడం వల్ల సమస్యలను త్వరగా గుర్తించి, పరిష్కార మార్గాలు చర్చించే అవకాశం ఏర్పడుతోంది. ఇది పార్టీలో కమ్యూనికేషన్ గ్యాప్‌ను తగ్గించే దిశగా ఉన్నట్లు కనిపిస్తోంది.పార్టీలోని వర్గ విభేదాలను అధిగమించి, ఐక్యంగా ముందుకు సాగాలనే సందేశం అధిష్టానం నుంచి స్పష్టంగా వస్తోంది. జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో జరిగిన చర్చల్లో ఈ అంశం ప్రాధాన్యం పొందినట్లు సమాచారం. ఎన్నికల్లో విజయం సాధించాలంటే అంతర్గత సమస్యలు అడ్డంకిగా మారకూడదనే అవగాహనతో, నాయకుల మధ్య సమన్వయం పెంచే చర్యలు చేపట్టబడుతున్నాయి. ఇది పార్టీ సంస్థాగత బలాన్ని పెంచి, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచే అవకాశం కలిగిస్తుంది.ఢిల్లీలో జరుగుతున్న ఈ కదలికలు తెలంగాణలో బీజేపీ స్థానిక స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసే ప్రయత్నంగా భావిస్తున్నారు. ఎన్నికలకు ముందు అంతర్గత ఐక్యతను నిర్ధారించుకోవడం, స్పష్టమైన బాధ్యతల పంపిణీ, కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడం వంటివి ఇప్పుడు ప్రాధాన్యం పొందుతున్నాయి. ఈ వ్యూహం ఎంతవరకు ఫలితాలు ఇస్తుందనేది రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, ప్రతిపక్షాల పనితీరు, ప్రజా స్పందనపై ఆధారపడి ఉంటుంది. అయితే అధిష్టానం స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వడం, సమన్వయాన్ని ప్రోత్సహించడం పార్టీకి సానుకూల సంకేతంగా నిలుస్తోంది.మొత్తంమీద ఢిల్లీ వేదికగా జరుగుతున్న ఈ చర్చలు, సమావేశాలు తెలంగాణలో బీజేపీ రాజకీయ వ్యూహాన్ని మరింత స్పష్టం చేస్తున్నాయి. ఎన్నికల లక్ష్యం, అంతర్గత ఐక్యత, సంస్థాగత సమన్వయం ఈ మూడు అంశాలపై దృష్టి సారించి అధిష్టానం ముందుకు సాగుతున్నట్లు కనిపిస్తోంది.

# విజయ్ వర్సెస్ స్టాలిన్

**చెన్నై,** , విజయ్ పిలిచారు.. స్టాలిన్ రాలేదు. డీఎంకే ఎంపీలు రాలేదు. అన్నాడీఎంకే కూడా దూరంగానే నిలిచింది. మరోవైపు కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎం, ఐయూఎంఎల్, ఎండీఎంకేకు చెందిన ఎంపీలు మాత్రం విజయ్‌తో కలిసి కూర్చున్నారు. అంటే విజయ్ పిలుపును పూర్తిగా తిరస్కరించిన పరిస్థితి లేదు. అదే సమయంలో అన్ని పార్టీలను ఒకే వేదికపైకి తీసుకురావాలన్న లక్ష్యం కూడా పూర్తిగా నెరవేరలేదు. అందుకే ఈ సమావేశాన్ని విజయ్ విజయం అనీ.. వైఫల్యం అనీ ఒక్క మాటలో చెప్పలేం.అసలు డీలిమిటేషన్ అంటే నియోజకవర్గాల పునర్విభజన. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాలను పునఃసర్దుబాటు చేస్తే జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే ప్రమాదం ఉందన్నది తమిళనాడు పార్టీల ఆందోళన. కుటుంబ నియంత్రణ, జనాభా నియంత్రణ వంటి అంశాల్లో ముందున్న రాష్ట్రాలకు.. తర్వాత పెరిగిన జనాభా ఆధారంగా రాజకీయ ప్రాతినిధ్యం తగ్గించడం న్యాయం కాదన్న వాదన చాలాకాలంగా ఉంది. అందుకే డీలిమిటేషన్ తమిళనాడులో కేవలం నియోజకవర్గాల లెక్క కాదు.. రాష్ట్ర హక్కుల అంశంగా మారింది.ఈ అంశంపై డీఎంకే ఇప్పటికే పోరాటం చేస్తోంది. స్టాలిన్ నేతృత్వంలో గతంలోనే అఖిలపక్ష సమావేశాలు కూడా జరిగాయి. తమిళనాడుకు అన్యాయం జరగకూడదన్న వాదనను డీఎంకే జాతీయ స్థాయిలో కూడా వినిపించింది. అంటే డీలిమిటేషన్ వ్యతిరేక పోరాటం విజయ్‌తో మొదలైంది కాదు. మరి ఇప్పుడు విజయ్ అదే అంశంపై ప్రత్యేకంగా ఎంపీల సమావేశం ఎందుకు పెట్టారు? అన్నదే అసలు రాజకీయ ప్రశ్న.ఇక్కడే విజయ్ రాజకీయ వ్యూహం కనిపిస్తోంది. ఒక సమస్యపై అన్ని పార్టీలను ఒకే టేబుల్ దగ్గరకు తీసుకురావడం ద్వారా తాను కేవలం ఒక పార్టీ అధినేతను కాదని.. తమిళనాడు ప్రయోజనాల కోసం అందరినీ కలుపుకొని వెళ్లగల నాయకుడిననే ఇమేజ్‌ను నిర్మించుకోవాలని చూస్తున్నారా? అన్న చర్చ మొదలైంది. ఎందుకంటే ఎన్నికల్లో ప్రత్యర్థిని ఓడించడం ఒక రాజకీయ విజయం. కానీ ప్రత్యర్థి పార్టీలతో కూడా ఒక రాష్ట్ర ప్రయోజనం కోసం మాట్లాడగల స్థాయిని చూపించడం మరో రకమైన నాయకత్వ పరీక్ష.అయితే ఈ సమావేశానికి స్టాలిన్ రాకపోవడమే ఇప్పుడు విజయ్‌కి అతిపెద్ద రాజకీయ ప్రశ్నగా మారింది. స్టాలిన్ వచ్చి ఉంటే కథ మరోలా ఉండేది. విజయ్ పిలుపునకు స్పందించి స్టాలిన్ కూడా అదే వేదికపై కూర్చుని తమిళనాడు హక్కుల కోసం కలిసి పోరాడతామని ప్రకటించి ఉంటే.. విజయ్ రాజకీయ ఇమేజ్‌కు అది భారీ బూస్ట్ అయ్యేది. తనకంటే సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న స్టాలిన్‌ను కూడా ఒక సమస్యపై తన వేదికపైకి తీసుకురాగలిగాడనే ప్రచారం జరిగేది.కానీ స్టాలిన్ రాలేదు. డీఎంకే ఎంపీలు కూడా రాలేదు. ఇది విజయ్‌కు ఒకవైపు ఎదురుదెబ్బే. కానీ రాజకీయంగా మరో అవకాశం కూడా. ఎందుకంటే ఇప్పుడు విజయ్ ప్రజల్లో ఒక ప్రశ్నను బలంగా



తీసుకెళ్లవచ్చు. తమిళనాడు కోసం అందరినీ పిలిచాను.. కలిసి మాట్లాడుదామని చెప్పాను. ఎవరు వచ్చారు? ఎవరు రాలేదనేది మీరు చూశారని చెప్పొచ్చు. రాజకీయాల్లో కొన్ని సందర్భాల్లో ప్రత్యర్థి గైర్హాజరు కూడా ప్రచార ఆయుధంగా మారుతుంది. స్టాలిన్ విజయ్ వేదికపైకి వచ్చి ఉంటే.. విజయ్‌కి ఒక రోజు రాజకీయ మైలేజ్ వచ్చేది. రాకపోవడంతో.. విజయ్ దాన్ని ఒక నేరేటివ్‌గా మార్చుకునే అవకాశం వచ్చింది.అయితే ఇక్కడ మరో లెక్క ఉంది. తమిళనాడుకు చెందిన మొత్తం 57 మంది ఎంపీల్లో 20 మంది మాత్రమే సమావేశానికి రావడం అంటే దాదాపు 35 శాతం మంది మాత్రమే హాజరైనట్టే. మిగిలిన 37 మంది.. అంటే దాదాపు 65 శాతం మంది రాలేదు. కాబట్టి దీనిని అన్ని పార్టీల ఏకాభిప్రాయ సమావేశంగా చెప్పడం సాధ్యం కాదు. కానీ వచ్చిన 20 మంది వివిధ పార్టీలకు చెందినవారు కావడం మాత్రం విజయ్‌కు రాజకీయంగా ఉపయోగపడే అంశం.ముఖ్యంగా కాంగ్రెస్ రావడం.. డీఎంకే దూరంగా ఉండటం ఆసక్తికరమైన పరిణామం. డీఎంకేకు కాంగ్రెస్‌తో రాజకీయ సంబంధం ఉన్నప్పటికీ.. విజయ్ ఏర్పాటు చేసిన వేదికకు కాంగ్రెస్ ఎంపీలు రావడం ద్వారా డీలిమిటేషన్‌ను పార్టీ రాజకీయాలకు అతీతమైన అంశంగా చూడాలన్న వాదన బలపడింది. అయితే దీన్ని వెంటనే కాంగ్రెస్–డీఎంకే మధ్య విభేదాలకు సంకేతంగా చూడటం తొందరపాటే అవుతోంది. కానీ విజయ్ మాత్రం ఈ పరిణామాన్ని తన రాజకీయ ప్రయోజనానికి ఉపయోగించుకునే అవకాశం ఉంది.ఇప్పటివరకు తమిళ రాజకీయాల్లో ప్రధాన పోరు డీఎంకే వర్సెస్ అన్నాడీఎంకే. రెండు పెద్ద రాజకీయ ధృవాల చుట్టూనే ఎన్నికలు తిరిగేవి. ఇప్పుడు విజయ్ రంగంలోకి వచ్చారు. 2026 రాజకీయ సమీకరణాల్లో ఆయన ఎదుగుదలతో పాత లెక్కలకు కొత్త సవాలు ఎదురైంది. అందుకే డీలిమిటేషన్ వంటి రాష్ట్ర హక్కుల అంశం విజయ్‌కు కేవలం ఒక విధానపరమైన అంశం కాదు.. తన నాయకత్వాన్ని ప్రదర్శించుకునే రాజకీయ వేదిక కూడా.అయితే విజయ్ ముందున్న అసలు పరీక్ష ఇక్కడే ఉంది. ఒక సమావేశం పెట్టడం సులువు.. ఆ సమావేశాన్ని ఉద్యమంగా మార్చడం కష్టం. డీలిమిటేషన్‌పై నిజంగా పోరాడాలంటే పార్లమెంట్‌లో ఎంపీలను సమన్వయం చేయాలి.

# టీపీసీసీలో నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్ల

## సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యం

**హైదరాబాద్,** ,తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ) నిర్మాణంలో ముఖ్యమైన మార్పులు రాబోతున్నట్లు కనిపిస్తోంది. పార్టీ అధికార వర్గం ఒకే వ్యక్తి చేతుల్లో అధికారం కేంద్రీకరించకుండా, వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో కుల, వర్గ సమతుల్యతను కాపాడుకోవాలని వ్యూహాత్మకంగా టీపీసీసీ అడుగులు వేస్తోంది.పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి ఆధ్వర్యంలో జరిగిన కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలోనే ఈ విషయం ప్రధానంగా చర్చకు వచ్చింది. ఏఐసీసీ స్థాయి నుంచి టీపీసీసీలో నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమించాలనే ప్రతిపాదనకు అంతా ఓకే చెప్పారు. ఇది స్థానిక నాయకత్వం, కేంద్ర నాయకత్వం మధ్య సమన్వయంతో జరుగుతున్న ప్రక్రియను సూచిస్తుంది. కేవలం ఒక చీఫ్‌పైనే భారం పడకుండా, బహుళ నాయకత్వ నమూనాను అమలు చేయాలనే ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోంది.ప్రస్తుత పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ బీసీ నేపథ్యం నుంచి వచ్చినవారు కావడం ఈ నిర్ణయానికి మూలకారణం. ఒక వర్గం మాత్రమే ఆధిపత్యం చెలాయించకుండా, ఇతర సామాజిక వర్గాల నుంచి ప్రతినిధులను తీసుకురావాలనే స్పష్టమైన ఆలోచన ఉంది. దీని ద్వారా పార్టీ లోపలి అసంతృప్తిని తగ్గించి, విస్తృత సామాజిక ఆధారాన్ని బలోపేతం చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అనిపిస్తోంది.సామాజికవర్గాల వారీగా సముత్యం పాటిస్తు నలుగురిని ఎంపిక చేసినట్లు తెలిసింది. ఇక ఆమోదముద్రే తరువాయి అని తెలుస్తోంది. ఎంపిక చేసిన నలుగురు పేర్లను పీసీసీ జాతీయ నాయకత్వానికి పంపినట్లు సమాచారం. ఎంపిక చేసినవారిలో ఎస్సీ వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ వర్గం నుంచి బలరాం నాయక్, మైనారిటీ వర్గం నుంచి అజ్మతుల్లా లేదా ఒబైదుల్లా, ఓసీ వర్గం నుంచి రోహిన్ రెడ్డి లేదా పద్మావతి రెడ్డికి అవకాశం దక్కనుంది.వర్కింగ్ ప్రెసిడెంట్లతోపాటు ప్రచార కమిటీ ఛైర్మన్ పదవి



కూడా చర్చనీయాంశమైంది. ఈ పదవికి జగ్గారెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. ప్రచార వ్యూహాలు, సందేశాల రూపకల్పనలో అనుభవం ఉన్న నాయకులను ముందుంచడం పార్టీ ప్రచార యంత్రాంగాన్ని బలోపేతం చేసే ప్రయత్నంగా చూడవచ్చు.నాలుగు వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం టీపీసీసీని మరింత వికేంద్రీకృతంగా మార్చగలదు. ఒకే వ్యక్తి నిర్ణయాలపై ఆధారపడకుండా, వివిధ వర్గాలు, ప్రాంతాలు, సమస్యలపై సమాంతరంగా పని చేసే అవకాశం ఏర్పడుతుంది. అయితే, ఇలాంటి బహుళ నాయకత్వ నమూనా విజయవంతం కావాలంటే స్పష్టమైన బాధ్యతల పంపిణీ, సమన్వయం అవసరం. లేకపోతే అంతర్గత పోటీలు, సంకేతాల గందరగోళం ఏర్పడే అవకాశం కూడా ఉంది.తెలంగాణలో కాంగ్రెస్ తన సామాజిక ఆధారాన్ని విస్తృతం చేసుకోవాలని, అంతర్గత సమతుల్యతను కాపాడుకోవాలని టీపీసీసీ చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. తదుపరి నిర్ణయాలు ఎలా ఉంటాయో, ఎవరు కచ్చితంగా ఎంపిక అవుతారో చూడాలి.

# రష్యా నుంచి భారత్‌కు రైలు మార్గం వయా పాకిస్థాన్

**న్యూఢిల్లీ,** , రష్యా నుంచి భారత్‌కు రైల్వే కనెక్టివిటీని ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆ దేశ ఉప ప్రధాని మరాట్ ఖుస్నులిన్ ప్రతిపాదించారు. ఈ మార్గం తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మీదుగా సాగి హిందూ మహాసముద్రానికి చేరుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో అనుసంధానమయ్యే ఏ మార్గమైనా పరిశీలించేందుకు అనుకూలమేనని స్పష్టం చేశారు. బోస్ఫరస్, హర్మూజ్ జలసంధుల వద్ద ఎదురయ్యే భద్రతా, వాణిజ్యపరమైన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ భూభాగ మార్గాల అవసరం పెరుగుతోందని రష్యా భావిస్తోంది.రష్యా నుంచి భారత్‌కు రైలులో సరుకు రవాణా చేసే మార్గం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రపంచంలోని కీలక సముద్ర వాణిజ్య మార్గాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొంటున్న నేపథ్యంలో.. సముద్ర మార్గాలకు ప్రత్యామ్నాయంగా భారీ రైల్వే కారిడార్‌ను అభివృద్ధి చేసే అవకాశాన్ని రష్యా పరిశీలిస్తోంది. రష్యా ఉప ప్రధాని మరాట్ ఖుస్నులిన్ ఈ ప్రతిపాదనను ప్రస్తావించారు. రష్యా నుంచి హిందూ మహాసముద్రం వరకు రైల్వే లింక్ ఏర్పాటు చేసే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆయన సూచించారు. తుర్క్‌మెనిస్తాన్, ఇరాన్, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మీదుగా ఈ రైల్వే మార్గాన్ని తీసుకెళ్లే అవకాశం ఉందని తెలిపారు. భారత్‌కు చేరుకునే అవకాశం కల్పించే ఏ రూట్ అయినా తమకు పరిశీలనీయమేనని పేర్కొన్నారు.బోస్ఫరస్, హోర్ముజ్ జలసంధులపై ఆధారపడే అంతర్జాతీయ వాణిజ్య మార్గాలకు భద్రతాపరమైన ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో రష్యా ఈ ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకటి. ప్రపంచ చమురు వాణిజ్యంలో సుమారు నాలుగో వంతు, ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాల్లో దాదాపు ఐదో వంతు ఈ ప్రాంతం గుండా సాగుతుందని అంచనా. ఈ మార్గంలో అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది.ఇటీవలి కాలంలో అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య సైనిక ఉద్రిక్తతలు పెరగడంతో హర్మూజ్ జలసంధి ప్రాధాన్యం మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో సముద్ర మార్గాల్లో అంతరాయాలు ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు అవసరమని రష్యా భావిస్తోంది. రష్యా



ప్రతిపాదనల ప్రకారం సాధ్యమైన రైల్వే కారిడార్ తుర్క్‌మెనిస్తాన్ నుంచి ఇరాన్, అఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ మీదుగా హిందూ మహాసముద్రంకు చేరేలా ఉండనుంది. ఈ మార్గం పూర్తిగా అమలులోకి వస్తే రష్యాకు సముద్ర మార్గాలపై ఆధారపడటాన్ని కొంత మేర తగ్గించే అవకాశం ఉంటుంది.ముఖ్యంగా భారత్‌తో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు ఈ తరహా భూభాగ రవాణా మార్గం ఉపయోగపడే అవకాశం ఉందని రష్యా భావిస్తోంది. అయితే ప్రతిపాదిత మార్గంలో ఉన్న దేశాల భౌగోళిక, భద్రతా, రాజకీయ పరిస్థితులు, మౌలిక వసతులు వంటి అనేక అంశాలు ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను ప్రభావితం చేయనున్నాయి.రష్యా చేస్తున్న ప్రతిపాదనలో భారత్‌కు అనుసంధానం కల్పించే మార్గాలకు ప్రత్యేక ప్రాధాన్యం కనిపిస్తోంది. భారత్‌కు చేరుకునే అవకాశం ఉన్న ఏ రూట్ అయినా పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని రష్యా ఉప ప్రధాని పేర్కొనడం దీనికి సంకేతంగా భావిస్తున్నారు. ఇలాంటి రైల్వే కారిడార్ అందుబాటులోకి వస్తే రష్యా–భారత్ మధ్య సరుకు రవాణాకు కొత్త మార్గం ఏర్పడే అవకాశం ఉంటుంది. సముద్ర రవాణాలో అంతరాయాలు ఏర్పడిన సందర్భాల్లో ప్రత్యామ్నాయ మార్గంగా ఇది ఉపయోగపడవచ్చు. అయితే ఇది ప్రస్తుతం ప్రతిపాదన దశలోనే ఉంది. మార్గం ఖరారు, నిర్మాణ వ్యయం, దేశాల మధ్య ఒప్పందాలు, భద్రతా అంశాలు వంటి అనేక దశలను దాటాల్సి ఉంటుంది.మొత్తంగా చూస్తే.. సముద్ర వాణిజ్య మార్గాల్లో పెరుగుతున్న భద్రతా సవాళ్లకు ప్రత్యామ్నాయంగా రష్యా భూభాగ రవాణా మార్గాలపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. రష్యా నుంచి హిందూ మహాసముద్రం, అక్కడి నుంచి భారత్‌తో కనెక్టివిటీ సాధ్యమైతే.. భవిష్యత్తులో రెండు దేశాల వాణిజ్య సంబంధాలకు ఇది కీలకమైన కొత్త మార్గంగా మారే అవకాశం ఉంది.

# రైతుల పంట విరామం

**ఏలూరు,** , ఆరుగాలం శ్రమించిన పంట చేతికి అందుతుందన్న దశలో ప్రకృతి వైపరీత్యాల బారినపడి ఖరీఫ్ పంట నాశనం అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికంతటికి మురుగు కాలువల ఆక్రమణ, విచ్చలవిడిగా ఆక్వా వ్యర్థాలు పంట కాలువల్లోనూ వదులుతుండటం కారణమని రైతులు వాపోతున్నారు. జూలై నెలాఖరు వరకు సక్రమంగా సాగునీరు అందని పరిస్థితి ఉందని చెబుతున్నారు. ఇలా అనేక కారణాలు తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నాయని, ఈ క్రమంలోనే సాగు చేయలేమంటూ రైతులు విరమణ ప్రకటించారు అల్లవరం మండలం తాడికోన గ్రామంలో వరి రైతులు. ఊడ్చని చేలు వద్ద పంట విరామం ప్రకటిస్తున్నట్లు ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో చర్చకు దారితీసింది. ఈ క్రమంలోనే తాడికోన గ్రామంలో ఎవ్వరు ఊడ్చేది లేదని రైతులు తేల్చి చెప్పారు. డ్రెయిన్ల ఆక్రమణపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన కనీసం స్పందించడం లేదని అన్నారు. దీంతో చిన్నపాటి వర్షాలకి పంట పొలాలు ముంపు గురై పంట నాశనం అవుతుందని వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడులు దక్కక అప్పుల పాలవుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క విచ్చలవిడిగా ఆక్వా చెరువులు తవ్వి అక్రమ సాగు చేస్తున్న తీరుపై ఫిర్యాదులు చేస్తున్న కనీస చర్యలు తీసుకోవడం లేదంటూ రైతులు మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో పంట విరామం ప్రకటిస్తున్నట్లు తాడికోన రైతులు వెల్లడించారు.అల్లవరం మండలం బెండమూర్లంకలో చారిత్రాత్మకమైన మొదటి పంట విరామ ఉద్యమం 2011లో రైతులు ప్రకటించారు. రైతులకు గిట్టుబాటు ధర లభించకపోవడం,



పెట్టుబడి వ్యయం పెరిగిపోవడం, డ్రెయినేజీ సమస్యల వల్ల బెండమూర్లంక రైతులు తొలిసారిగా ఈ వినూత్న ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఉద్యమ ప్రభావం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనమైంది. దీంతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మోహన్ కందా కమిటీ వేసి క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులపై విచారణ చేపట్టించారు. ఇదే తరహాలో కాలువల ఆధునికీకరణ, ధాన్యం బకాయిల ఆలస్యంపై నిరసనగా మళ్లీ 2022 ఖరీఫ్ సీజన్‌లో బెండమూర్లంకతోపాటు అల్లవరం మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు పంట విరామం ప్రకటించారు. మళ్ళీ ఇప్పుడు ఇదే మండలంలోని తాడికోన గ్రామం నుంచి పంట విరామం ఉద్యమం ప్రారంభించారు.

# పిఠాపురంలో రోడ్లకు మహర్దశ



**కాకినాడ,** : ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిఠాపురం నియోజకవర్గాన్ని దేశంలోనే ఒక ఆదర్శవంతమైన మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గవ్యాప్తంగా పల్లెల నుంచి పట్టణాల వరకు మౌలిక వసతుల కల్పనకు, ముఖ్యంగా రహదారుల పునర్నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కేవలం రోడ్ల నిర్మాణం, మరమ్మతుల కోసమే ఏకంగా రూ. 200 కోట్లకు పైగా నిధులను వెచ్చించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సాస్కీ, రోడ్లు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖల భాగస్వామ్యంతో మొత్తం 307 కిలోమీటర్ల మేర నూతన రహదారుల నిర్మాణ ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే రూ. 100 కోట్ల అంచనా వ్యయంతో 152 కిలోమీటర్ల మేర 611 రోడ్ల నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. నిర్ణీత లక్ష్యంలో దాదాపు 80 శాతం పనులు పూర్తి కావడంతో పిఠాపురం నియోజకవర్గంలో రవాణా వ్యవస్థ రూపురేఖలు మారిపోయి గ్రామాల్లో కొత్త కళ సంతరించుకుంది.రహదారుల నిర్మాణంలో ప్రజల, రైతులు, మత్స్యకారుల అవసరాలను ప్రాతిపదికగా తీసుకున్నారు. దశాబ్దాలుగా తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ఉప్పాడ తీరప్రాంత మత్స్యకారుల కోసం ప్రత్యేకంగా జెట్టీకి వెళ్లే మార్గంలో గ్రావెల్ రోడ్డును నిర్మించి వారి రవాణా కష్టాలను తీర్చారు. అంతేకాకుండా సముద్ర కోత వల్ల ఇళ్లను కోల్పోయిన మాయాపట్నం మత్స్యకారులకు సుబ్బంపేట సమీపంలో కల్పించిన కొత్త మాయాపట్నం పునరావాస కాలనీలో 13 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ రూ. 1.52 కోట్లతో 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 2.8 కిలోమీటర్ల డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు.కొత్తసూరాడపేట పునరావాస కాలనీకి సైతం రూ. 93 లక్షలతో 1.6 కిలోమీటర్ల సిమెంటు రోడ్లు నిర్మించి, ప్రధాన రహదారికి అనుసంధానం చేశారు. తుపాన్ల ధాటికి పూర్తిగా కొట్టుకుపోయిన యు.కొత్తపల్లి మండలంలోని అమరవిల్లి–రామన్నపాలెం బీచ్ రోడ్డును రూ. 88 లక్షలతో పునర్నిర్మించడం ద్వారా వేలాది మంది ప్రజలకు, స్థానిక బషీర్ బీబీ ఆలయ దర్శనానికి వెళ్లే భక్తులకు మార్గం సుగమమైంది. సెజ్ పరిధిలో ఉండి ఏళ్ల తరబడి అభివృద్ధికి దూరమైన ముమ్మిడివారిపాడు గ్రామానికి రూ. 79.70 లక్షలతో శాశ్వత రహదారిని అందుబాటులోకి తెచ్చారు. కొత్తపల్లి గ్రామంలో ప్రజల చిరకాల కోరికైన శ్మశాన వాటిక దారిని రూ. 26.30 లక్షలతో సీసీ రోడ్డుగా మలిచారు. కొండెవరం గ్రామ పరిధిలోని పిఠాపురం–ఉప్పాడ ఆర్ అండ్ బీ రోడ్డును రూ. 1.22 కోట్ల ఉపాధి నిధులతో పవన్ కళ్యాణ్ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారు. మరోవైపు దశాబ్దాలుగా గుంతలమయమై నరకప్రాయంగా మారిన గొల్లప్రోలు మండలం వెన్నెపూడి జీఎన్టీ ప్రధాన రహదారిని రూ. 85 లక్షలతో, గొల్లప్రోలు–తాటిపర్తి పుంత రోడ్డును రూ. 1.46 కోట్లతో పునర్నిర్మించి రైతులకు, ప్రయాణికులకు ఊరటనిచ్చారు. చిత్రాడ గ్రామంలోని ఈబీసీ కాలనీ వాసుల కోసం రూ. 3 కోట్లతో సీసీ రోడ్లు, ఆధునిక డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల భద్రతకై రూ. 50 లక్షలతో ప్రహరీ గోడను నిర్మించారు.వ్యవసాయ రంగ సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ 'పల్లెపండుగ 2.0' ద్వారా పంట పొలాల మధ్య ఉన్న డొంక రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పి.రాయవరం, బి. ప్రత్తిపాడు గ్రామాల్లో కోటి రూపాయలకు పైగా వెచ్చించి 3 కిలోమీటర్ల మేర నిర్మించిన గ్రావెల్ రోడ్లు దాదాపు 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములకు మెరుగైన రవాణా సదుపాయాన్ని కల్పించాయి. అభివృద్ధి పనులపై నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పురోగతిలో ఉన్న 70 కిలోమీటర్ల పెండింగ్ రోడ్డు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాలని స్పష్టం చేశారు

# జనాలు ఓట్లు రాలుస్తాయా.....



**విజయవాడ,** : వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి పర్యటనలు ఎప్పుడూ రాజకీయంగా చర్చనీయాంశంగానే మారుతుంటాయి. ఆయన ఎక్కడికి వెళ్లినా పెద్ద ఎత్తున ప్రజలు కనిపించడం సహజమే. గతంలో పార్టీ నాయకులు ప్రత్యేకంగా జనసమీకరణ చేపట్టేవారనే విమర్శలు వినిపించేవి. అయితే ఇప్పుడు పరిస్థితి మారిందని వైసీపీ నాయకులు చెబుతున్నారు. జగన్ పర్యటనలకు ప్రజలు స్వచ్ఛందంగా వస్తున్నారని, ఎవరినీ ప్రత్యేకంగా తీసుకురావాల్సిన అవసరం లేదని వారు వాదిస్తున్నారు. ఇటీవల శ్రీకాకుళం తూర్పుగోదావరి జిల్లాల్లో జరిగిన పర్యటనల్లో కనిపించిన జనసందోహాన్ని ఇందుకు ఉదాహరణగా చూపిస్తున్నారు.అయితే ఈ పరిస్థితిని మరో కోణంలో కూడా రాజకీయ విశ్లేషకులు పరిశీలిస్తున్నారు. పెద్ద ఎత్తున జనాలు రావడం రాజకీయంగా బలం చూపించినా, భద్రతా పరంగా మాత్రం సవాళ్లు పెంచుతుందని వారు అభిప్రాయపడుతున్నారు. భారీగా ప్రజలు చేరడం వల్ల తొక్కిసలాటలు, ఆస్తి నష్టం లేదా అనుకోని ఘటనలు జరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలాంటి సంఘటనలు భవిష్యత్తులో రాజకీయంగానే కాకుండా చట్టపరంగానూ ఇబ్బందులు తీసుకురావచ్చని అంచనా వేస్తున్నారు.ఇటీవల తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన పర్యటన సందర్భంగా ఒక మహిళకు చెందిన దుకాణం దెబ్బతినడం, పొగాకు బేళ్లపై కొందరు ఎక్కి తొక్కడం వంటి ఘటనలు చర్చకు వచ్చాయి. అలాగే శ్రీకాకుళం జిల్లాలో మహిళా ఎస్సై విధులు నిర్వహిస్తున్న సమయంలో జరిగిన తోపులాట కూడా వివాదాస్పదమైంది. ఈ సంఘటనలకు సంబంధించిన వీడియోలు, వివరాలను అధికార వర్గాలు ప్రత్యర్థి పార్టీ నాయకులు నమోదు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.గతంలో గుంటూరు జిల్లాలో జరిగిన మరో ఘటన కూడా తరచూ ప్రస్తావనకు వస్తోంది. ఒక పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వెళ్లిన సమయంలో జరిగిన రద్దీలో మరో కార్యకర్త వాహనం కింద పడి ప్రాణాలు కోల్పోయిన సంఘటనపై కేసు నమోదైంది. ఇలాంటి సంఘటనలు రాజకీయ కార్యక్రమాల్లో భద్రత ఎంత ముఖ్యమో గుర్తు చేస్తున్నాయి.ఇదే తరహా ఘటనలు దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా చోటుచేసుకున్నాయి. తమిళనాడులో విజయ్ నిర్వహించిన భారీ ర్యాలీ సందర్భంగా తొక్కిసలాట జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయిన విషయం దేశవ్యాప్తంగా చర్చకు వచ్చింది. అలాగే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర సమయంలో కూడా భారీ జనసందోహం కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. బీహార్ లో ప్రశాంత్ కిశోర్ పాదయాత్ర సందర్భంగా భద్రతా సమస్యలు వెలుగులోకి వచ్చాయి.ఈ పరిణామాల నేపథ్యంలో రాజకీయ సభలు, ర్యాలీలు, పాదయాత్రల నిర్వహణలో భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే కార్యక్రమాలపై ప్రభుత్వం, పోలీసులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశముంది. భవిష్యత్తులో జగన్ చేపట్టే పాదయాత్ర లేదా ఇతర భారీ కార్యక్రమాలకు అనుమతులు, భద్రతా నిబంధనల విషయంలో మరింత కఠినమైన షరతులు విధించే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ బలం చూపించడమే కాకుండా ప్రజల భద్రతను కాపాడటం కూడా అన్ని పార్టీల ప్రధాన బాధ్యత అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**జైలు కెళ్తే టిక్కెట్ గ్యారంటీ**

వైసీపీలో ఇపుడు కొత్త చర్చ సాగుతోంది. పార్టీ కోసం జనంలో ఉండి పోరాడామని ఎవరు చెప్పినా దానికి అధికారిక పత్రం ఏమి ఉంటుంది అన్నదే అంతా అనుకుంటారు. అదే ఏదో విధంగా జనంలోకి వచ్చి పోరాటాలు చేస్తే ఆ మీదట ఎటూ పోలీసులు కేసు కడతారు, అలా అరెస్టు అయి జైలు పాలు అయితే అది నేరుగా అధినాయకత్వం దృష్టిలోకి వెళ్తుందని తప్పకుండా అలాంటి వారికే టికెట్ దక్కుతుందని అంటున్నారు. వైసీపీలో ఈ అరెస్టులు జైళ్ళు ఇలా ఎంతో మంది నాయకులు గత రెండేళ్ళుగా ఎదుర్కొంటూ వచ్చారు, ఇపుడు మరింత మంది జైలులో ఉన్నారు, ఇంకొంతమంది జైలుకు వెళ్ళే బాటలో ఉన్నారని అంటున్నారు. వైసీపీ నేతలు ఎవరైనా అరెస్టు అయితే ఆ పార్టీ అధినాయకత్వం నుంచి భారీ రియాక్షన్ వస్తోంది. నేరుగా జగన్ ట్వీట్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం మీద విమర్శలు కూడా అందులో చేస్తున్నారు. అంతే కాదు వారికి పరామర్శలు ఆ మీదట భారీ ప్రచారం వంటివి వెంటవెంటనే జరిగిపోతున్నాయి. ఇటీవల కాలంలో చూసుకుంటే శ్రీకాకుళం జిల్లాలో మాజీ మంత్రి సీదరి అప్పలరాజు అరెస్టు అయితే జగన్ పరామర్శకు జైలు దాకా వెళ్ళి వచ్చారు. ఆ తరువాత కర్నూలు జిల్లాకు చెందిన ఎమ్మెల్యే విరూపాక్షని అరెస్టు చేశారు. ఇపుడు శ్రీకాకుళంలో ఆముదాలవలస ఇంచార్జి చింతాడ రవి కుమార్ ని అరెస్టు చేశారు. దీంతో వైసీపీ నేతలు అంతా ఆయనకు సంఘీభావం ప్రకటించారు. అధినాయకత్వం కూడా దీని మీద ఘాటుగా స్పందించింది. ఆముదాలవలస అంటే మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అందరికీ గుర్తుకు వస్తారు. అలాంటి చోట 2024 ఎన్నికల తరువాత వైసీపీ అధినాయకత్వం చేసిన మార్పులలో భాగంగా యువ నేత అయిన చింతాడ రవికుమార్ కి ఇంచార్జి బాధ్యతలు అప్పగించింది. ఆయన నాటి నుంచి పార్టీని యాక్టివ్ గా చేస్తున్నారు. జగన్ తాజా శ్రీకాకుళం పర్యటనలో ఆయన భారీ జనాలతో తరలి వచ్చారు. ఈ సందర్భంగానే మహిళా ఎస్సైతో జరిగిన గొడవలో ఆయనను అరెస్టు చేశారు. ఇక ఇపుడు ఆయనకు ఆముదలవలస టికెట్ ఖరారు అయినట్లే అని అంటున్నారు. మరో వైపు భూ కబ్జా ఆరోపణల మీద మాజీ స్పీకర్ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. దాంతో కూడా చింతాడ రవి కుమార్ కి కలసి వచ్చింది అని అంటున్నారు.

# జనసేన పవర్ ఫుల్ ప్లాన్




**విజయవాడ,** : జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైలెంట్ గా తన పని తాను చేసుకుని పోతున్నారు. ఒక వైపు పార్టీ అధినేతగా జనసేనను సంస్థాగతంగా బలోపేతం చేసే కార్యక్రమాలు చేస్తున్నారు. మరో వైపు ఉప ముఖ్యమంత్రిగా తన దగ్గర ఉన్న ప్రాధాన్యత కలిగిన శాఖలను పూర్తిగా అవగాహన చేసుకుని వాటి పనితీరులో మెరుగుదల చూపిస్తున్నారు. అటవీ శాఖ ద్వారా గిరిజన ప్రాంతాలలో రోడ్లు వేయించి అడవి తల్లి బాట పేరుతో వారికి దారి చూపిస్తున్నారు. అలాగే పంచాయతీ రాజ్ శాఖ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నారు. పనిలో పనిగా పర్యావరణ శాఖ మీద కూడా ఆయన దృష్టి పెట్టారు. ఇటీవల అనకాపల్లి జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం అయిన పంచదార్ల వద్ద అక్రమ మైనింగ్ జరుగుతోందని తెలిసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నో మైనింగ్ జోన్ గా ప్రకటించాలని కూడా సూచించారు.ఇక పార్టీ పరంగా చూస్తే పవన్ కళ్యాణ్ బూత్ లెవెల్ నుంచి జనసేనను పటిష్టం చేసే కార్యక్రమం ముమ్మరం చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే వారికే పెద్ద పీట వేస్తున్నారు. అంతే కాక వారు జనసేనలో ఏళ్ళ తరబడి పనిచేసేలా ఉండడమే అర్హతగా చూసుకుంటున్నారు. రేపు జరిగే స్థానిక ఎన్నికల్లో జనసేన జెండా ఎత్తిన వారికే సీట్లు అన్న విధానం కూడా తీసుకుని రావాలని చూస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ విధంగా జనసేనను నమ్ముకుంటే తమకు న్యాయం జరిగింది అన్నది పార్టీ క్యాడర్ అంతా అనుకుని సుదీర్ఘ కాలం పాటు గట్టిగా నిలబడేలా జనసేన అధినాయకత్వం పక్కాగా ప్రణాళికలను రచిస్తోంది అని అంటున్నారు. ఇక దైనందిన విషయాల్లో ప్రత్యర్థుల మీద విమర్శలు ఉంటూ ఉంటాయి. వైసీపీ మీద ప్రతీ రోజూ విమర్శలు చేసే విధానానికి జనసేన దూరంగా ఉంటోంది. అందుకే ఆ పార్టీ తన లక్ష్యాలను ఏమిటో నిర్దేశించుకుని వాటికి అనుగుణంగా ముందుకు సాగుతోంది అని అంటున్నారు. వారిని వీరు వీరిని వారు విమర్శించుకోవడం వల్ల ఉపయోగం లేదని మీడియాలో హైప్ క్రియేట్ కావడం తప్ప గ్రౌండ్ లెవెల్ లో ఏమీ ఉండదని జనసేన భావిస్తోంది. అందుకే జనసేన ఈ తరహా విమర్శల రాజకీయానికి దూరంగా ఉంటోంది అని అంటున్నారు. ఇక జనసేన 2029 ఎన్నికల మీదనే తన చూపు నిలిపింది అని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఎక్కువ సీట్లు పొత్తులో భాగంగా కోరాలీ అంటే ముందు పార్టీగా బలపడాల్సిన అవసరం ఉందని జనసేన నమ్ముతోంది. పార్టీకి బూత్ లెవెల్ నుంచి క్యాడర్ అలాగే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలతో పాటు నియోజకవర్గాన్ని నడిపించే బలమైన నాయకత్వం ఉంటే కచ్చితంగా ఎక్కువ సీట్లు తీసుకోవచ్చు అని భావిస్తోంది. వచ్చే ఎన్నికలు జనసేనకు ఒక విధంగా కీలకం అని అంటున్నారు. ఎక్కువ సీట్లు తీసుకుని 2024 మాదిరిగానే సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ తో గెలిస్తే కచ్చితంగా ఆ తరువాత ఏర్పడే ప్రభుత్వంలో ముఖ్యమైన పాత్ర పోషించేందుకు వీలు ఉంటుందని కూడా ఆలోచిస్తోంది అని అంటున్నారు. మొత్తానికి జనసేన దీర్ఘ కాలం ఆలోచనలు చేస్తోంది. అందుకే సైలెంట్ గానే పవన్ తన పని ఏంటో చేసుకుని పోతున్నారు అని అంటున్నారు.

# ఉలవపాడులో పునాస మామిడికి డిమాండ్



**ఒంగోలు,** : ఏపీలో ఉలవపాడు మామిడి రైతుల పంట పండింది. ఈ సీజన్‌లో దొరికే పునాస రకం మామిడితో భారీ లాభాలు అందుకుంటున్నారు. ఈసారి కేజీ కాయలు రూ.50 వరకు పలుకుతున్నాయి.. దీంతో రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ నెలలో ఓనం పండగ కూడా ఉండటంతో మామిడి కాయలకు ఇంకా మంచి ధర వస్తుందని రైతులు ఆశిస్తున్నారు. ఈ ఏడాది కాస్త లాభాలు వస్తాయని చెబుతున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రకాశం జిల్లా ఉలవపాడు మామిడి కాయలు బాగా ఫేమస్. బంగినపల్లి, రసాలు సహా పలు రకాల మామిడి కాయలు సీజన్‌లో దొరుకుతాయి. మార్చి నెలలో సీజన్ మొదలైతే.. జూన్ వరకు కొనసాగుతుంది. ప్రతి ఏటా సీజన్ ముగిశాక కూడా మామిడి రైతులు పునాస రకం కాయల ద్వారా ఆదాయం పొందుతున్నారు. కొన్నేళ్లుగా పునాస కాయలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈ ఏడాది మాత్రం అలా కాదు.. పునాస కాయల ధరలు దుమ్ము రేపుతున్నాయి.. భారీగా లాభాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు.ప్రకాశం జిల్లా గుడ్లూరు, ఉలవపాడు మండలాలు సహా అన్ని చోట్లా కలిపి పునాస మామిడిని ఐదువేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ప్రధానంగా బంగినపల్లి, రసాలు, బెంగళూరు రకం కాయల సీజన్ తర్వాత.. జులై, ఆగస్టు నెలల్లో పునాస పంట చేతికి వస్తుంది. నాలుగైదు రోజులుగా ఈ పునాస రకం మామిడి కాయలకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. కేజీ రూ.50 వరకు పలుకుతోంది.. టన్ను రూ.50వేల వరకు ఉంది. గుడ్లూరు మండలంలో ప్రతి రోజూ నాలుగు టన్నులు వరకు కాయలు చెన్నై, బెంగళూరు సహా ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. ఉలవపాడుకు ఈ కాయల్ని తీసుకొచ్చి ఇతర రాష్ట్రాలకు లారీల ద్వారా పంపిస్తున్నారు.ఈ పునాస మామిడి కాయలు కేరళంలో నిర్వహించే ఓనం పండగకు వినియోగిస్తుంటారు. అందుకే కేరళం రాష్ట్రానికి ఎగుమతులు ఎక్కువగా పునాస కాయల్ని ఎగుమతి చేస్తుంటారు. ఆగస్టు నెలాఖరులో ఈ పండగ ఉండటంతో.. కాయల ధర మరింత పెరిగే అవకాశం ఉందని, లాభాలు వస్తాయని రైతులు ఆనందంలో ఉన్నారు. ఈ ఏడాది బంగినపల్లి దిగుబడి బావుంది.. కానీ ధరలు మాత్రం లేవు. సీజన్ ముగిసే సమయంలో టన్ను రూ.60వేలు కూడా పలకలేదు. దీంతో రైతులు పెట్టుబడులు కూడా రాలేదని నిరాశ చెందారు.. ఈసారి పునాస రకం మామిడి కాయలకు మంచి ధర రావడంతో ఆ నష్టాల నుంచి కాస్త బయటపడతామని చెబుతున్నారు.

# వైసీపీలో సాహూ ఆన్ డ్యూటీ..

**విజయవాడ, ఆగస్టు 5 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ వచ్చే ఎన్నికలలో గెలుపు కోసం ఎన్నికల వ్యూహకర్తను మార్చినట్లు తెలిసింది. కపిల్ సాహును ఆయన నియమించుకున్నారని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. జగన్ పర్యటనలను డిజైన్ చేయడంతో పాటు ఇప్పటికే నియోజకవర్గాల వారీగా నివేదికలను కపిల్ సాహు టీం జగన్ కు అందిస్తున్నట్లు సమాచారం. అందుకే జగన్ ఈసారి ఎన్నికల్లో తమదే గెలుపు అన్న ఆత్మవిశ్వాసంతో ఉన్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. కపిల్ సాహు టీం ఇప్పటికే ఏపీ రాజకీయాలపై ఫోకస్ పెట్టిందని అంటున్నారు. జగన్ ఎక్కడకు వెళ్లినా విపరీతమైన జనం రావడం, టూర్ ఆలస్యమవ్వడం వ్యూహకర్త వ్యూహంలో భాగమేనని అంటున్నారు. అయితే ఈ పేరు అధికారికంగా బయటకు రాకపోయినా అనధికారికంగా కపిల్ సాహు డ్యూటీలోకి దిగినట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. టీవీకే అధినేత విజయ్ ఎన్నికల వ్యూహకర్త గా కపిల్ సాహు వ్యవహరించారు. ఆయన ప్రముఖ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ బృందంలో పనిచేసి, ఆ తర్వాత సొంతంగా 'పొలిటికల్ కన్సల్టింగ్ డొమైన్' అనే సంస్థను ఏర్పాటు చేసి విజయ్ పార్టీ టీవీకే విజయం కోసం పనిచేశారు.

# రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు



**విశాఖపట్టణం,** , కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన జిల్లాలలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ఉంది. ప్రస్తుత జిల్లా పరిషత్‌ల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో కొత్త జిల్లా పరిషత్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. ఈ నెలాఖరు నాటికి ప్రస్తుత జిల్లాపరిషత్ సభ్యుల పదవీకాలం పూర్తి కానుంది. ఈ నేపథ్యంలో పదవీకాలం పూర్తి అయిన తర్వాత కొత్త జిల్లాపరిషత్‌లు ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కొత్త జిల్లా పరిషత్‌ల ఏర్పాటుపై రాష్టంలోని అన్ని జిల్లా పరిషత్ సీఈవోలతో ప్రభుత్వం సమావేశం కానుంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే, రాబోయే నెలల్లో కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం జిల్లా పరిషత్ ఎన్నికల తర్వాత, 2022 ఏప్రిల్‌లో కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అయితే, పరిపాలనాపరమైన ఇబ్బందులను నివారించడానికి, అప్పటికే ఎన్నికైన జిల్లా పరిషత్ మండళ్లు.. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన తమ కార్యకలాపాలను కొనసాగించాయి. కొత్తగా ఏర్పడిన జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు ఇప్పటికీ ఉమ్మడి జిల్లా పరిషత్ సమావేశాలకు హాజరవుతున్నారు.మరోవైపు కొత్త జిల్లాల కోసం ప్రత్యేక జిల్లా పరిషత్‌లను ఏర్పాటు చేసి, వాటికి ప్రత్యేక కార్యాలయ భవనాలను సమకూర్చాలని ప్రస్తుత ప్రభుత్వం ఆలోచిస్తోంది. విశాఖపట్నం జిల్లా పరిషత్ మూడు జిల్లా పరిషత్‌లుగా.. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజుగా విభజించనున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాలను ఏర్పాటు చేయనున్నారు. విశాఖపట్నం జిల్లా పరిషత్ కార్యాలయం మాత్రం ప్రస్తుతం ఉన్న భవనం నుంచే తన కార్యకలాపాలను కొనసాగిస్తుంది.విశాఖపట్నం జిల్లా పరిషత్‌కు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ఉన్న ఉద్యోగులలో సుమారు 60 శాతం మందిని 24 మండలాలు కలిగిన అనకాపల్లి జిల్లాకు, 30 శాతం మందిని 11 మండలాలు కలిగిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మిగిలిన 10 శాతం మందిని కేవలం నాలుగు మండలాలు మాత్రమే ఉన్న విశాఖపట్నం జిల్లాకు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు అనకాపల్లి , అల్లూరి సీతారామరాజు జిల్లాల యంత్రాంగాలు ఇప్పటికే కొత్త జిల్లా పరిషత్ కార్యాలయాల కోసం తగిన భవనాలను, స్థలాలను గుర్తించాయి.లోకల్ బాడీ ఎన్నికల తర్వాత కేబినెట్‌మంత్రులు మౌనంగా ఉంటే సహించేది లేదని సీఎం చంద్రబాబు తేల్చి చెప్పారు. ముఖ్యంగా టీడీపీ మంత్రులకు ఆయన ఈ విషయంలో ఇప్పటికే చాలా సార్లు హెచ్చరికలు జారీ చేశారు. అయినప్పటికీ చాలా మంది మంత్రులు మౌనంగా ఉండడం.. కనీసం పన్నెత్తు విమర్శ కూడా చేయకపోవడంతో సీఎం మరోసారి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయమే టెలీ కాన్ఫరెన్సు నిర్వహించిన సీఎం చంద్రబాబు.. మంత్రులకు వారి బాధ్యతలను గుర్తు చేసినట్టు తెలిసింది. ఫైళ్ల క్లియరెన్సు, శాఖలపై పట్టు విషయంలో రెండున్నరేళ్లు అవుతున్నా.. ఇప్పటికీ ఐదుగురు టీడీపీ మంత్రులు పట్టు పెంచుకోలేక పోయారని చంద్రబాబు తేల్చి చెప్పారు. ఇక, ప్రత్యర్థులు చేస్తున్న దాడిని ఎదుర్కొనడంలో దాదాపు సగం మంది మౌనంగానే ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇంకా.. ప్రతి విషయాన్నీ తాను చెప్పాలంటే కుదరదని.. ఇక నుంచి అయినా.. మిషన్ మోడ్‌తో పనిచేయాలని సూచించారు. ప్రత్యర్థులు రెచ్చిపోతున్నా.. మంత్రులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు.ఇక, స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంత్రులకు బాధ్యతలు ఎక్కువగా ఉంటాయని చంద్రబాబు పేర్కొన్నారు. ఒక్క చోట కూడా.. కూటమి పార్టీలు ఓటమి చవి చూడకూడదని స్పష్టం చేశారు. ఎవరూ అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. అదే సమయంలో మీడియా ముందుకు రావడం.. ప్రజలకు మంచిని వివరించడం చేయాలని చెప్పారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నా.. దాని తాలూకు ఫలితం ఓట్ల రూపంలో మారకపోతే.. ఎలాంటి ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు.తానే స్వయంగా మంత్రుల పనితీరును పరిశీలించనున్నట్టు సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జిల్లాల ఇంచార్జ్ మంత్రులు.. అసలు జిల్లాల్లో పర్యటించడం లేదని తనకు నివేదికలు అందాయన్నారు. ముఖ్యంగా అంతర్గత పోరును తగ్గించాలని చెబుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇది సరికాదన్న ఆయన 'పనితీరు మెరుగు పరుచుకోని వారు.. ఆలోచన చేసుకోవాలి" అని పరోక్షంగా హెచ్చరించారు. వచ్చే స్థానిక ఎన్నికల తర్వాత.. ఫలితాన్ని బట్టి మార్పులు ఉండే అవకాశం ఉందని ఆయన పరోక్షంగా మంత్రి వర్గ ప్రక్షాళనపై సంకేతాలు ఇచ్చేశారు.

## డాక్టర్లు నాలుకను ఎందుకు పరీక్షిస్తారో తెలుసా?



మనం డాక్టర్ దగ్గరకు వెళ్ళినప్పుడు, వారు ముందుగా చేసే పని 'నాలుక చూపించమని' అడగడం. ఇది ఏదో సాధారణ పరీక్ష అని మనం అనుకుంటాం, కానీ మన నాలుక మన శరీర ఆరోగ్యానికి ఒక అద్దం వంటిది. మనకు తెలియకుండానే లోపల పెరుగుతున్న ఇన్ఫెక్షన్లు, పోషకాహార లోపాలు, చివరికి క్యాన్సర్ వంటి వ్యాధులను కూడా నాలుక రంగు మరియు ఆకృతిని బట్టి గుర్తించవచ్చు. ఆమె రోజూ ఉదయం లేవగానే అద్దంలో తన ముఖాన్ని చూసుకుంటుంది కానీ, తన నాలుకలో వస్తున్న మార్పులను గమనించలేదు. అతనికి నాలుకపై ఒక చిన్న పుండు పడింది, అది వారం గడిచినా తగ్గడం లేదు. మనం సాధారణంగా నాలుకను కేవలం రుచి చూడటానికే వాడుతాం, కానీ అది మన శరీరంలోని అనారోగ్యాలను ముందే హెచ్చరించే ఒక 'అలారం' అని మీకు తెలుసా? రంగు మారినా, పగుళ్లు వచ్చినా లేదా వింతైన పూత కనిపిస్తున్నా.. అది మీ శరీరం పంపుతున్న అత్యవసర సంకేతం కావచ్చు. ఉదయం లేవగానే నాలుకపై పల్చని తెల్లటి పొర ఉండటం సహజం. కానీ, ఆ పూత మందంగా ఉండి, బ్రష్ చేసినా పోకపోతే అది 'ఓరల్ థ్రష్' (ఫంగల్ ఇన్ఫెక్షన్) కావచ్చు. ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారిలో లేదా రోగనిరోధక శక్తి తగ్గిన వారిలో కాండిడా అనే ఈస్ట్ పెరగడం వల్ల ఇలా జరుగుతుంది. మీ నాలుక అసాధారణంగా ఎర్రగా, ఉబ్బినట్లు కనిపిస్తే దానిని 'స్ట్రాబెర్రీ టంగ్' అంటారు. ఇది శరీరంలో విటమిన్ బి12 లేదా ఫోలిక్ యాసిడ్ లోపాన్ని సూచిస్తుంది. అలసట, చేతులు తిమ్మిర్లు రావడం వంటి లక్షణాలు కూడా దీనికి తోడైతే వెంటనే రక్త పరీక్ష చేయించుకోవడం మంచిది.సాధారణంగా నోటి పూత వారం రోజుల్లో తగ్గిపోతుంది. కానీ, నాలుకపై వచ్చిన పుండు రెండు వారాలు దాటినా తగ్గకుండా, నొప్పిగా ఉంటే అది ఓరల్ క్యాన్సర్ సంకేతం కావచ్చు. ముఖ్యంగా ధూమపానం, మద్యం సేవించే వారు ఇటువంటి మార్పుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలి.నాలుక తన సహజ సిద్ధమైన గులాబీ రంగును కోల్పోయి పాలిపోయినట్లు కనిపిస్తే, అది శరీరంలో రక్తం తక్కువగా ఉందని (అనీమియా) చెప్పడానికి ఒక నిదర్శనం. ఐరన్ లోపం వల్ల ఎర్ర రక్త కణాలు తగ్గడం వల్ల ఇలా జరుగుతుంది.నాలుకపై లోతైన గీతలు లేదా పగుళ్లు ఉండటం సాధారణంగా ప్రమాదకరం కానప్పటికీ, అక్కడ ఆహార పదార్థాలు చేరి ఇన్ఫెక్షన్లకు దారితీయవచ్చు. అలాగే, పసుపు రంగు పూత ఉంటే అది జీర్ణక్రియ సమస్యలను లేదా నోటి పరిశుభ్రత లోపాన్ని సూచిస్తుంది.ఆధునిక వైద్యంలో ఎన్ని స్కానింగ్లు వచ్చినా, శారీరక పరీక్షలో నాలుకకు ఉండే ప్రాధాన్యత తగ్గలేదు.

# మార్కెట్లోకి కల్తీ పుచ్చకాయలు...!

ప్రస్తుతం కల్తీ సమస్య ఆహార పదార్థాలన్నింటినీ ప్రభావితం చేస్తోంది. కొందరు వ్యాపారులు పుచ్చకాయలను త్వరగా పండేలా చేయడానికి, లోపలి భాగం ఎర్రగా కనిపించేలా చేయడానికి ఇంజెక్షన్లు ఉపయోగిస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలా కల్తీ చేసిన పుచ్చకాయలను తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు. ఈ ఏడాది ఎండలు తీవ్రంగా ఉండేట్లే ఉన్నాయి. ఇంకా ఏప్రిల్ నెల రాకముందే పగటిపూట ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు చాలా మంది మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరుకు రసం వంటి చల్లని పానీయాలతో పాటు శరీరానికి చలువ చేసే పండ్లను ఎక్కువగా తీసుకుంటున్నారు.

వేడి నుంచి ఉపశమనం కలిగించే అలాంటి పండ్లలో పుచ్చకాయ మొదటి స్థానంలో ఉంటుంది. ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో పాటు పీచు, పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ ం, విటమిన్ అ వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ ఈ పండును ఎంతో ఇష్టంగా తింటారు. అయితే ప్రస్తుతం కల్తీ సమస్య ఆహార పదార్థాలన్నింటినీ ప్రభావితం చేస్తోంది. కొందరు వ్యాపారులు పుచ్చకాయలను త్వరగా పండేలా చేయడానికి, లోపలి భాగం ఎర్రగా కనిపించేలా చేయడానికి ఇంజెక్షన్లు ఉపయోగిస్తున్నారని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# బాదం పప్పుల గురించి నిజాలు....



బాదం పప్పులు అనగానే మనకు గుర్తొచ్చేది సూపర్ ఫుడ్. జ్ఞాపకశక్తి పెరగాలన్నా, చర్మం మెరవాలన్నా బాదం తినాలని పెద్దలు చెబుతుంటారు. కానీ అతి సర్వత్ర వర్జయేత్ అన్నట్లు.. ఆరోగ్యానికి మంచివి కదా అని వీటిని అపరిమితంగా తీసుకుంటే మాత్రం శరీరానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మీ శరీరంలో కొన్ని అసాధారణ మార్పులు కనిపిస్తే బాదం మీకు సరిపడటం లేదని గుర్తించాలి. జీర్ణ సమస్యలు: బాదంలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియకు మేలు చేసినప్పటికీ అధికంగా తీసుకోవడం వల్ల రివర్స్ అవుతుంది. రోజుకు పరిమితికి మించి బాదం తింటే గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం లేదా విరేచనాలు వంటి సమస్యలు తలెత్తుతాయి. అందుకే వీటిని మితంగా తీసుకోవడం శ్రేయస్కరం. కిడ్నీలో రాళ్ల ప్రమాదం: బాదంపప్పులో ఆక్సలేట్ అనే సమ్మేళనం అధికంగా ఉంటుంది. శరీరంలో ఆక్సలేట్ పరిమాణం పెరిగితే, అది మూత్రపిండాల్లో పేరుకుపోయి రాళ్లుగా మారే ప్రమాదం ఉంది. ఇప్పటికే కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారు బాదానికి దూరంగా ఉండటం లేదా వైద్యుల సలహా తీసుకోవడం ఉత్తమం.బరువు పెరిగే అవకాశం: బాదంలో ఆరోగ్యకరమైన కొవ్వులు, కేలరీలు ఎక్కువగా ఉంటాయి. వీటిని స్నాక్స్‌లాగా కుప్పలు కుప్పలుగా తింటే శరీరంలో కేలరీల శాతం పెరిగి, బరువు తగ్గడానికి బదులు పెరిగే అవకాశం ఉంటుంది. బరువును అదుపులో ఉంచుకోవాలనుకునే వారు రోజుకు 5-10 పప్పులకు మించి తినకూడదు. అలెర్జీల పట్ల అప్రమత్తత: కొంతమందికి నట్స్ అంటే అలెర్జీ ఉంటుంది.

## అందరికి మేలు చేసే అవకాడో వారికి చాలా డేంజర్..



మనలో చాలా మంది అవకాడోను ఎక్కువగా తింటారు. వీటిని అధికంగా తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు వెల్లడించారు. జీర్ణ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడేవారు అస్సలు తినకూడదు. మగవారిలో ఎంతో మంది అవకాడోను ఎక్కువగా తింటారు. వీటిని తినడం వలన కొందరికి ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చేసిన పరిశోధనల్లో తేలింది. జీర్ణ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడేవారు అవకాడోను తినకపోవడమే మంచిది. తింటే కడుపు నొప్పి వచ్చే అవకాశం ఉంది. మైగ్రేన్ తలనొప్పి ఉన్నవారు అవకాడోను దూరం పెట్టాలి. ఎందుకంటే వీటిలో ఉండే 'టైరమైన్' తల నొప్పిని పెంచుతుంది. ఈ అవకాడోను తింటే బరువు ఈజీగా పెరుగుతారు. వారు మాత్రం అస్సలు తినొద్దు. సన్నగా ఉండే వాళ్ళు ఉంటే లావు అవుతారని నిపుణులు చెబుతున్నారు.

అవకాడో తిన్న తర్వాత దురదలు వస్తాయి ఇలాంటి వారు అస్సలు తినకండి. ఇంకా నోటి పుండ్లు కూడా వస్తాయి. మగవారిలో ఎంతో మంది అవకాడోను ఎక్కువగా తింటారు. వీటిని తినడం వలన కొందరికి ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చేసిన పరిశోధనల్లో తేలింది. జీర్ణ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడేవారు అవకాడోను తినకపోవడమే మంచిది. తింటే కడుపు నొప్పి వచ్చే అవకాశం ఉంది. మైగ్రేన్ తలనొప్పి ఉన్నవారు అవకాడోను దూరం పెట్టాలి. ఎందుకంటే వీటిలో ఉండే 'టైరమైన్' తల నొప్పిని పెంచుతుంది.

## 'కింగ్100'కు రాక్‌స్టార్ మ్యూజిక్....



కింగ్ అక్కినేని నాగార్జున తన కెరీర్ లో ఎంతో ముఖ్యమైన అడుగును చాలా జాగ్రత్తగా వేయబోతున్నాడు. ఆయన చాలా ప్రతిష్టాత్మకంగా చేస్తోన్న 100వ సినిమా ప్రస్తుతం సెట్స్ మీద ఉంది. ఈ సినిమా నాగార్జున కెరీర్‌లో మైల్ స్టోన్ మూవీగా నిలవబోతోంది. అందుకోసం మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఈ సినిమాను తమిళ యంగ్ డైరెక్టర్ రా కార్తీక్ తెరకెక్కిస్తుండగా, అన్నపూర్ణ స్టూడియోస్‌తో కలిసి మనం ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్లపై నాగార్జున స్వయంగా నిర్మిస్తున్నారు. స్రుతం నాగార్జున.. తన 100వ మూవీని ఎంతో ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నాడు. ఈ చిత్రానికి 'కింగ్100' లేదా 'లాటరీ కింగ్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరో క్రేజీ అప్‌డేట్‌ను అన్నపూర్ణ స్టూడియోస్ ప్రకటించింది.భారతీయ సినిమా రంగంలో అత్యంత ప్రసిద్ధి చెందిన సంగీత దర్శకులలో ఒకరైన రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ (డీఎస్పీ) ఈ ప్రాజెక్ట్‌కు సంగీత దర్శకుడిగా అధికారికంగా చేరారు. నాగార్జున దేవిశ్రీ ప్రసాద్‌లది సక్సెస్‌ఫుల్ కాంబినేషన్. నాగార్జున 'మన్మథుడు', 'మాస్', 'కింగ్', 'కుబేర' చిత్రాలకు డీఎస్పీ అందించిన సంగీతం చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు ఈ మైలురాయి చిత్రానికి కూడా అదే స్థాయి మ్యాజిక్‌ను సంగీతాన్ని అందిస్తారనే అంచనాలున్నాయి. ఇప్పటికే ఈ చిత్రంలో టబు కీలక పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించారు. 'నిన్నే పెళ్లాడతా', 'ఆవిడ మా ఆవిడే' వంటి క్లాసిక్ చిత్రాల తర్వాత నాగార్జున, టబు కాంబినేషన్ మరోసారి 27 ఏండ్ల తర్వాత పునరావృతం అవుతుండటంతో సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఇప్పుడు డీఎస్పీ ఎంట్రీతో 'కింగ్ 100'పై అంచనాలు మరింత పెరిగాయిల

## ఓటిటిలోకి వచ్చేస్తున్న రష్మిక ట్రయాంగిల్ లవ్‌స్టోరీ సినిమా



షాహిద్ కపూర్ హీరోగా, రష్మిక, కృతి సనన్ హీరోయన్లుగా నటించిన చిత్రం 'కాక్‌టెయిల్ 2'. హోమీ అదజానియా ఈ సినిమాకు దర్శకత్వం వహించారు.

ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ జూన్ 19న విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి టాక్ సొంతం చేసుకుంది. తాజాగా ఈ మూవీ ఒటిటిలో సందడి చేసేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఒటిటి సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఆగస్టు 14 నుంచి స్ట్రీమింగ్ కానుంది. 2026లో విడుదలై తొలి వీకెండ్‌లో రూ.50 కోట్లు దాటిన హిందీ సినిమాల్లో 'కాక్‌టెయిల్ 2' ఒకటిగా నిలిచింది.


## గోపిచంద్ 'భరతవర్ష' నుంచి ప్రత్యేక వీడియో...



**హైదరాబాద్ :** 'తొలివలపు' అనే సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత విలన్‌గా కెరీర్ ప్రారంభించి.. ఆ తర్వాత హీరోగా మారి ఎన్నో అద్భుతమైన సినిమాలు చేసిన నటుడు గోపిచంద్. విలక్షణమైన సినిమాలు చేయడంతో ఆయన ఎప్పుడు ముందుంటారు. అయితే గత రెండేళ్లలో గోపిచంద్ సినిమాలు రాలేదు. 2024లో ఆయన 'విశ్వం' అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించారు. శ్రీనువైట్ల దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఊహించినంత సక్సెస్ సాధించలేకపోయింది. ప్రస్తుతం గోపిచంద్ 'భరతవర్ష' అనే సినిమాలో నటిస్తున్నారు. తాజాగా గోపిచంద్ ఇండస్ట్రీకి వచ్చి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా 'భరతవర్ష' టీమ్ ఓ ప్రత్యేక వీడియోని విడుదల చేసింది. విలక్షణమైన సినిమాలు చేయడంతో ఆయన ఎప్పుడు ముందుంటారు. అయితే గత రెండేళ్లలో గోపిచంద్ సినిమాలు రాలేదు. 2024లో ఆయన 'విశ్వం' అనే సినిమాతో ప్రేక్షకులను పలకరించారు. శ్రీనువైట్ల దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఊహించినంత సక్సెస్ సాధించలేకపోయింది. ప్రస్తుతం గోపిచంద్ 'భరతవర్ష' అనే సినిమాలో నటిస్తున్నారు. తాజాగా గోపిచంద్ ఇండస్ట్రీకి వచ్చి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నారు.ఇండస్ట్రీకి వచ్చి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు గోపిచంద్‌కు అభినందనలు తెలిపింది.

## 'చైనా పీస్' ఇక 'సీక్రెట్ సోల్జర్'

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘు బాబు, రంగస్థలం మహేశ్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు. ఇంతకుముందు 'చైనా పీస్' పేరుతో ప్రేక్షకులకు పరిచయమైన ఈ చిత్రం, ఇప్పుడు 'సీక్రెట్ సోల్జర్' పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.



## 'ఎల్లమ్మ' నుంచి అప్‌డేట్.. దేవిశ్రీ ప్రసాద్ ఫస్ట్‌లుక్ విడుదల



సంగీత దర్శకుడిగా ఎన్నో మరపురాని ఆల్బమ్స్ అందించిన దేవి శ్రీ ప్రసాద్ నేడు తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు.

ఈ సందర్భంగా ఆయన హీరోగా పరిచయం అవుతున్న 'ఎల్లమ్మ' మూవీ టీం సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ సినిమా నుంచి దేవి ఫస్ట్‌లుక్‌ని విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో ఆయన చేతిలో కిరీటం పట్టుకొని రెట్రో లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన పాత్ర పేరు 'పర్షి' అని చిత్ర యూనిట్ తెలిపింది. "ఎల్లమ్మ'.. నుంచి పర్షిని పరిచయం చేస్తున్నాం. మట్టి నుంచి పుట్టిన ఈ పాత్రను మీరెప్పటికీ గుర్తుంచుకుంటారు.

## స్పైడర్‌మ్యాన్ సినిమాకు వసూళ్ల సునామీ....

టామ్ హాలెండ్, జెండయా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే'. జులై 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమాకి వసూళ్లు సునామీలా వస్తున్నాయి. మొదటి వారంలోనే 900 మిలియన్ డాలర్లకు పైగా వసూళ్లు చేసినట్లు చిత్ర బృందం తెలిపింది. ఇప్పటివరకూ బాక్సాఫీస్ వద్ద 927 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.8,830 కోట్లు) వసూళ్లు చేసింది.

దీంతో ప్రపంచ సినిమా చరిత్రలోనే రెండో అతి పెద్ద గ్లోబల్ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. సుమారు 225 మిలియన్ డాలర్లతో (సుమారు రూ.2,100 కోట్లు) రూపొందిన ఈ సినిమా, విడుదలైన మొదటి వీకెండ్‌లోనే బడ్జెట్‌ను అధిగమించింది. ఇప్పటివరకూ బాక్సాఫీస్ వద్ద 927 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.8,830 కోట్లు) వసూళ్లు చేసింది. దీంతో ప్రపంచ సినిమా చరిత్రలోనే రెండో అతి పెద్ద గ్లోబల్ ఓపెనింగ్ సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. 2019లో వచ్చిన 'అవెంజర్స్ : ది ఎండ్ గేమ్' చిత్రం 1.2 బిలియన్ డాలర్లు (రూ.11 వేల కోట్లు) వసూళ్లు చేసి ఈ సినిమా కంటే ఎక్కువ ఓపెనింగగ్ సాధించిన చిత్రంగా మొదటిస్థానంలో ఉంది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1,
Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com